ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

ప్రకాశం

జిల్లా వార్తలు

బుధవారం 28, మే 2025

ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు టీచర్లను టెన్షన్‌కు గురిచేస్తున్నాయి. ఒకవైపు పాయింట్ల తిరకాసు, మరోవైపు కోరుకున్న స్థానం దక్కుతుందో లేదోనన్న బెంగతో ఒత్తిడికి గురవుతున్నారు. బదిలీల్లో కీలకమైన పాయింట్ల కేటాయింపు వ్యవహారం కూడా వారిని కలవరపెడుతోంది. అధికారుల అనుమతితో సెలవుపై వెళ్లిన ఒక గ్రేడ్-2 హెచ్‌ఎంకి నెగటివ్ పాయింట్ కేటాయించినట్లు తెలిసి నివ్వెరపోతున్నారు. స్టేషన్ పాయింట్ల కేటాయింపులో అధికారుల ద్వంద్వవైఖరి టీచర్లను ఆందోళనకు గురిచేస్తోంది. దీనికితోడు కమిషనర్ ప్రకటించిన షెడ్యూల్‌కు భిన్నంగా అధికారులు పరుగులు పెట్టిస్తుండటంతో తలలు పట్టుకుంటున్నారు.

టెన్షన్.. టెన్షన్

సెలవు పెడితే నెగటివ్ పాయింట్!

స్టేషన్ పాయింట్లలోనూ తిరకాసు

టీచర్లను పరుగులు పెట్టిస్తున్న అధికారులు

బదిలీల్లో అంతా అయోమయం.. గందరగోళం



సీనియారిటీ జాబితాలో తప్పులపై డీఈవో, ఎంఈవోలను కలిసి ఫిర్యాదు చేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లు

ఒంగోలు విద్య, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఒక జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అధికారుల ముందస్తు అనుమతితో సెలవు పెట్టి విదేశాలకు వెళ్లారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల కోసం ఆయన దరఖాస్తు చేశారు. అయితే అతనికి రావాల్సిన పాయింట్లతోపాటు ఒక నెగటివ్ పాయింట్‌ను కూడా విద్యాశాఖ అధికారులు కేటాయించారు. దీంతో కంగుతిన్న ఆ హెచ్‌ఎం తాను అధికారుల ముందస్తు అనుమతితోనే సెలవు పెట్టానని, విధులకు గైర్హాజరు కాలేదని మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. టీచర్ల బదిలీల్లో ఈ సంవత్సరం కొత్తగా నెగటివ్ పాయింట్లు ప్రవేశపెట్టారు. నెలరోజులపాటు ఎటువంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైతే ఒక నెగటివ్ పాయింట్ కేటాయిస్తున్నారు. అయితే ఈ హెచ్‌ఎంకు అన్ని అనుమతులూ ఉండి అధికారులు సెలవు మంజూరుచేసినా కేవలం ఏప్రిల్‌లో ముఖ హాజరు వేయలేదన్న కారణంతో నెగటివ్ పాయింట్ కేటాయించారు. ఈ విషయం తెలియడంతో ఉపాధ్యాయలోకంలో ఆందోళన నెలకొంది.

స్టేషన్ పాయింట్లలో తిరకాసు

టీచర్లకు స్టేషన్ పాయింట్ల కేటాయింపులో కూడా ప్రభుత్వం తిరకాసు పెట్టింది. ఈ ఏడాది బదిలీలకు విద్యా సంవత్సరాన్ని ప్రాతిపాదికగా తీసుకున్నారు. హెచ్‌ఎంలకు ఐదేళ్లు, ఇతర టీచర్లకు ఎనిమిది సంవత్సరాలు గరిష్ఠంగా పూర్తయితే వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఒక విద్యా సంవత్సరంలో తొమ్మిది నెలలు పనిచేస్తే దానిని పూర్తి విద్యా సంవత్సరంగా పరిగణిస్తున్నారు. ఏడు సంవత్సరాల పది నెలలు పూర్తయినా ఎనిమిదేళ్లుగా పరిగణించి తప్పనిసరి బదిలీల జాబితాలో చేర్చారు. దీంతో వారు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. అయితే మొదట ప్రకటించిన ప్రకారం ఎనిమిదేళ్లకు బదిలీ పాయింట్లు కేటాయించాలి. అందుకు భిన్నంగా వీరికి ఏడు సంవత్సరాల పది నెలలకు మాత్రమే

మిగతా 4వ పేజీలో



ఉపాధ్యాయుల ఎస్‌ఆర్‌లను పరిశీలిస్తున్న సిబ్బంది

బదిలీలకు 6,630 దరఖాస్తులు

- ముగిసిన గడువు
- వచ్చేనెల 11తో ముగియనున్న ప్రక్రియ

4

ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

ఐదేళ్లు దాటితే తప్పనిసరి మార్పు

- ఇప్పటికే ఆయా శాఖలకు సిఫార్సు లేఖలు
- మహానాడు అనంతరం ప్రక్రియ జరిగే అవకాశం
- తప్పులు దొర్లకుండా కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- వైద్యశాఖకు నేడో, రేపో మార్గదర్శకాలు

ఒంగోలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే అధికారులు నియోజక వర్గాల వారీగా జాబితాలను సిద్ధం చేశారు. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీలను చేపట్టనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది సెప్టెంబరులో కొన్ని శాఖల్లో మాత్రమే ఉద్యోగుల బదిలీలను చేపట్టింది. అందులో కొన్ని డిపార్ట్‌మెంట్‌లలో అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో పెద్దఎత్తున దూమారం రేగింది. జిల్లా పంచాయతీ శాఖలో గ్రేడ్-5, 6 కార్యదర్శుల బదిలీల్లో జరిగిన అక్రమాలతో అప్పటి ఇన్‌చార్జి డీపీవోతోపాటు మరో ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయిన విషయం విదితమే. ఇప్పుడు

మిగతా 4వ పేజీలో




రేషన్ షాపుల్లోనే సరుకులు



- పాత పద్ధతిలో పంపిణీకి ఏర్పాట్లు
- దుకాణంతోపాటు ఐదు రకాల ఫొటోలు అప్‌లోడ్
- ఈ-పౌరసరఫరా యాప్‌లో వివరాలు నింపుతున్న అధికారులు

5



ఓబీసీ హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రవహిస్తున్న సాగర్ జలాలు

ఓబీసీకి చేరిన సాగర్ జలాలు

- 998 క్యూసెక్కులు సరఫరా
- మరింత పెరిగే అవకాశం
- తాగునీటి వనరులను నింపేందుకు అధికారుల సన్నద్ధం

దర్శి, మే 27(ఆంధ్రజ్యోతి) : తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు మంగళవారం ఒంగోలు బ్రాంచ్ కాలువకు చేరాయి. జిల్లాలో రామతీర్థం జలాశయంతోపాటు అనేక మంచినీటి చెరువుల్లో నీటి పరిమాణం తగ్గటంతో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం మూడు రోజుల క్రితం కుడికాలువకు నీరు విడుదల చేసిన విషయం విదితమే. అక్కడ నుంచి చివర్లో ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువకు జలాలు చేరడంతో మంచినీటి చెరువులకు నింపేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం సాగర్ ప్రధాన

మిగతా 4వ పేజీలో

వెల్లువెత్తుతున్న ఉత్సాహం



మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యేలు బీఎన్, కందుల, ముత్తుముల, దామచర్ల



మహానాడులో రక్తదానం చేసిన కార్యకర్తకు సర్టిఫికెట్ అందజేస్తున్న కమిటీ కన్వీనర్, మంత్రి డాక్టర్ స్వామి, పక్కన దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి

మహానాడు ప్రతినిధుల సభకు జిల్లా నుంచి భారీగా హాజరు

- వందలాది వాహనాల్లో వెళ్లిన టీడీపీ శ్రేణులు
- చంద్రబాబు, లోకేష్ ప్రసంగాలపై ఆసక్తి
- తొలిరోజు పార్టీ అంశాలపైనే ప్రధాన దృష్టి
- మంత్రి స్వామి నేతృత్వంలో రక్తదాన శిబిరం
- రూ.25లక్షలు విరాళం ఇచ్చిన ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు, మే 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కడప నగర సమీపంలో నిర్వహిస్తున్న మహానాడుకు జిల్లా నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మూడు రోజులపాటు అక్కడ జరగనున్న మహానాడు మంగళవారం ప్రారంభం కాగా ప్రతినిధుల సభ నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వందలాది వాహనాల్లో పార్టీ నాయకులు వెళ్లారు. తొలిరోజు ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణ అంశాలు, పార్టీ

మిగతా 4వ పేజీలో



రూ.25లక్షల చెక్కును మంత్రి అనగానికి అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, సత్య



మహానాడులో ఎంపీ మాగుంట, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర మాటామంతీ



శిడిమానుతో జరుగుతున్న గ్రామోత్సవం

వైభవంగా అద్దంకి నాంచారమ్మ తిరునాళ్ల

- అశేష భక్తుల నడుమ శిడిమహోత్సవం
- అమ్మవారికి పూజలు, అభిషేకాలు
- మొక్కులు తీర్చుకున్న ప్రజలు

వివరాలు 4వ పేజీలో..

దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో తాళ్లూరు మండలం మన్నేపల్లిలో చెన్నకేశవస్వామికి చెందిన కోట్లాది రూపాయల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయి. రికార్డుల్లో స్వామి పేరిట ఉన్నా, రైతులు తమవి అన్నట్లు ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్నారు. కౌలు కూడా చెల్లించకపోవడంతో ఆలయానికి ఆదాయం లేక గ్రామస్థులే దాతల సహకారంతో ఆలనాపాలన చూసుకుంటున్నారు.

భూంఫట్

మన్నేపల్లిలో చెన్నకేశవస్వామి ఆలయ భూములు కబ్జా

- దర్జాగా పంటల సాగు
- 63 ఎకరాలు ఉన్నా దేవుడికి పైసా చెల్లించని వైనం
- పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు
- దాతల సాయంతో ఆలయ పునర్నిర్మాణం



ఆక్రమించిన ఆలయ భూముల్లో సాగు చేసిన పచ్చిమేత



మన్నేపల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయం

తాళ్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నేపల్లి రెవెన్యూ పరిధిలో వెంకటగిరి రాజుల కాలంలో చెన్నకేశవస్వామి ఆలయం నిర్మించారు. దానికి 63 ఎకరాల భూమిని కేటాయించారు. దీని విలువ ప్రస్తుత ధరల ప్రకారం దాదాపు రూ.10 కోట్ల పైమాటే. సర్వేనంబర్ 881/1లో 0.23 ఎకరాలు, 621/3లో 0.63ఎకరాలు, 457/1లో 14.46 ఎకరాలు, 545లో 16.91ఎకరాలు, 621/1లో10.90ఎకరాలు, 621/3లో 0.63ఎకరాలు, 675/5లో 0.96 ఎకరాలు, ,674/10లో 0.97 ఎకరాలు, 130/1లో 6.02 ఎకరాలు, 134లో 12.10ఎకరాలు కలిపి మొత్తం 63.18 ఎకరాలు ఆలయం పేరిట ఉన్నాయి.

42ఏళ్ల క్రితం దేవదాయ శాఖకు అప్పగింత

పూర్వం ఆభూములు వెంకటగిరి సంస్థానాధీశుల పేరున ఉండగా, 1982-83లో దేవదాయ శాఖకు అప్పగించారు. అప్పటి ఈవో పాండురంగారెడ్డి ఆభూములను స్వాధీనం చేసుకొని చెన్నకేశవస్వామికి చెందినవిగా

మిగతా 4వ పేజీలో

జిల్లా జైలును పరిశీలించిన ఎస్పీ

అంతర్గత భద్రతపై అధికారులతో సమావేశం

ఒంగోలు క్రైం,మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా జైలులో భద్రత.. బ్యారక్‌లు, వైద్య సదుపాయాలు, పరిసరాలను ఎస్పీ దామోదర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం అంతర్గత భద్రతపై అధికారులతో సమావేశమయ్యారు. అక్కడ తీసుకోవాల్సిన కొన్ని భద్రత చర్యలపై సూచనలు చేశారు. రిమాండ్ ఖైదీలను తరలించే సమయంలో జైలు అధికారులు, పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. మహిళా ఖైదీలకు ప్రత్యేక భద్రత కల్పించాలని అన్నారు. సమావేశంలో జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు విజయకృష్ణ, నాగరాజు, శ్రీనివాసరావు, పాండురంగారావు, జైలర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జైలులో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్







మహానాడు సంబరం

కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.



టెన్షన్.. టెన్షన్..

(3వ పేజీ తరువాయి)

స్టేషన్ పాయింట్లు కేటాయించడంతో ఆయా టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. అయితే ఒకే స్థానంలో తొమ్మిదేళ్లు పనిచేసిన వారికి ఒక సంవత్సరం తగ్గించి గరిష్ఠంగా ఎనిమిదేళ్లకే పాయింట్లు కేటాయిస్తున్నారు. ఈ ద్వంద్వవైఖరిని టీచర్లు వ్యతిరేకిస్తున్నారు.

పరుగులు పెట్టిస్తున్నారు

బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న హెచ్‌ఎంలు, టీచర్లను అధికారులు పరుగులు పెట్టిస్తున్నారు. పాఠశాల విద్య కమిషనర్ విడుదల చేసిన షెడ్యూల్‌కు భిన్నంగా పైఅధికారులు వెబ్ కాన్ఫరెన్స్ సమావేశాల్లో నోటి మాటగా చెప్పడం, అందుకు అనుగుణంగా ఇక్కడి అధికారులు ఆదేశాలు ఇస్తుండటంతో టీచర్లు అయోమయానికి గురవుతున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీలకు సంబంధించి 27న తుది సీనియారిటీ జాబితా విడుదల చేయాలి. 28న వారు వెబ్ ఆప్షన్ పెట్టాలి. అందుకు భిన్నంగా 26వతేదీ సాయంత్రం నాలుగు గంటలకు హెచ్‌ఎంలు వెబ్ ఆప్షన్లు పెట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయ సంఘాల గ్రూపులో డీఈవో పేరుతో పోస్టింగ్‌లు వెలువడ్డాయి. తీరా సీనియారిటీ జాబితా 26వతేదీ అర్ధరాత్రి విడుదలైంది. 30వ తేదీన టీచర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉండగా 28వ తేదీనే విడుదలవుతాయని ప్రచారం జరుగుతోంది. అధికారుల హడావుడిగా తమను పరుగులు తీయిస్తే ఆ ఒత్తిడిలో తాము వెబ్ ఆప్షన్‌లు సరిగా పెట్టుకోకపోతే నష్టపోతామని హెచ్‌ఎంలు, టీచర్లు వాపోతున్నారు. ఇదిలా ఉండగా హెచ్‌ఎంల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితా తప్పులతడకగా ఉండటంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు స్కూల్ అసిస్టెంట్లు డీఈవోను కలిసి ఫిర్యాదు చేశారు.

టీచర్ల బదిలీలకు 6,630 దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి మంగళవారం సాయంత్రానికి 6,630 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసింది. మొత్తం బదిలీల ప్రక్రియ జూన్ 11వతేదీతో ముగియనుంది. చివరిగా ఆ రోజు సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల కానున్నాయి.

కేటగిరీ వారీగా దరఖాస్తుల వివరాలు ఇవీ...

పోస్టు పేరు	దరఖాస్తుల సంఖ్య
గ్రేడ్-2 హెచ్‌ఎంలు	141
స్కూలు అసిస్టెంట్ తెలుగు	416
స్కూలు అసిస్టెంట్ హిందీ	374
స్కూలు అసిస్టెంట్ ఇంగ్లీషు	427
స్కూలు అసిస్టెంట్ గణితం	514
స్కూలు అసిస్టెంట్ పీఎస్	425
స్కూలు అసిస్టెంట్ బీఎస్	282
స్కూలు అసిస్టెంట్ సోషల్	275
స్కూలు అసిస్టెంట్ సంస్కృతం	05
స్కూలు అసిస్టెంట్ పీడీ	163
స్కూలు అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్	37
సెకండరీగ్రేడ్ టీచర్లు(తెలుగు)	3,366
సెకండరీ గ్రేడ్ (ఉర్దూ)	09
ఎల్‌పీ తెలుగు	05
ఎల్‌పీ హిందీ	03
ఎల్‌పీ సంస్కృతం	02
పీఈటీ	30
పీఎస్‌హెచ్‌ఎం	149
మ్యూజిక్	01
ఎల్‌పీ ఉర్దూ	93
మొత్తం	6,630

వైభవంగా అద్దంకి నాంచారమ్మ తిరునాళ్ల

● అశేష భక్తుల నడుమ శిడిమహోత్సవం ● ఆకట్టుకున్న యువకుల సంబరాలు

పర్చూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో వేంచేసిన గ్రామదేవత అద్దంకి నాంచారమ్మ వారి తిరునాళ్ల మంగళవారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా వేకువ జామునే అలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పశువులను, వాహనాలను ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల వేడుకలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

అట్టహాసంగా శిడిమహోత్సవం

అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఏటా శిడిమహోత్సవం నిర్వహించడం సాంప్రదాయంగా మారింది. పంట చేతికి అందిన తరువాత తిరునాళ్లను నిర్వహించుకోవడం ఆచారం. మేకపోతును పూజించి, అమ్మవారిని ఆవహింపజేసి, అ మేకపోతును ఊసల పెట్టెలో ఉంచి శిడిమానును ఉంచి ఊరేగించడం సంప్రదాయం. దీంతోపాటు శిడిమానుకు రైతులు పండించిన వరి, మిరప, మొక్కజొన్న కంకునలు వేలాడుతీసి తమ భక్తిని చాటుకున్నారు. పాడిపంటలు బాగా పండాలని గ్రామం సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా ఆమ్మవారిని భక్తులు వేడుకున్నారు. అనంతరం శిడిమానును ఆలయం చుట్టూ తిప్పి గ్రామంలోని పలువీధుల్లో శిడిమానును లాగుతూ యువకుల కేరింతల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

అశేష జనాల మధ్య తిరునాళ్ల

అశేష భక్తుల మధ్య తిరునాళ్ల వేడుకలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించు కునేందుకు గ్రామ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో కొల్లా రాజేశ్వరరావు, నేతృత్వంలో గ్రామస్థుల సహకారంతో భారీఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దామా నాగేశ్వరరావు, ఆలయ వంశంపారంపర్య అర్చకులు తులసి వారు, ఆలయ పెద్దకాపు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో పర్చూరు, మార్టూరు ఎస్సైలు మాల్యాద్రి, వెంకరత్నం, 50 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.



అమ్మవారి తిరునాళ్ల వేడుకలను తిలకించేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

వెల్లువెత్తుతున్న ఉత్సాహం

(3వ పేజీ తరువాయి)

ప్రాధాన్యతలపై ప్రసంగాలు జరగ్గా పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగాలపై జిల్లా నుంచి వెళ్లిన ప్రతినిధులు ఆసక్తి కనబరిచారు. మంత్రి డాక్టర్ స్వామితోపాటు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ ఇతర ముఖ్య నేతలు ఒక రోజు ముందుగానే కడప చేరుకున్నారు. జిల్లాలోని వివిధ మండలాలు, పట్టణాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వందలాది మంది మంగళవారం ఉదయం ఉత్సాహంగా బయల్దేరి వెళ్లారు.

పెద్దసంఖ్యలో రక్తదానం

మహానాడు సందర్భంగా జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి కన్వీనర్‌గా ఉన్న కమిటీ నేతృత్వంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించగా పెద్దసంఖ్యలో పార్టీ కార్యకర్తలు రక్తదానం చేసినట్లు సమాచారం. వారికి మంత్రి స్వామి సర్టిఫికెట్లు అందజేయగా కమిటీలో సభ్యులుగా ఉన్న జిల్లా నేతలు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. మరోవైపు మహానాడు విజయవంతం కోసం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రూ.25లక్షల విరాళం అందజేశారు.

ఆ మహానాడు నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అందుకు సంబంధించిన చెక్కును అందజేశారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం మీద పార్టీ అధికారంలోకి తిరిగి రావడం, ప్రత్యేకంగా కడపలో నిర్వహిస్తుండటంతో మహానాడుకు పార్టీశ్రేణులు జిల్లా నుంచి ఉత్సాహంగా తరలివెళ్లారు.

భూంఫట్

(3వ పేజీ తరువాయి)

రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించారు. వీటిల్లో 30ఎకరాలు మంగళి మాన్యంగా వారి ఆధీనంలో ఉండగా, మిగిలిన 33 ఎకరాలు పలువురు రైతులు సాగుచేసుకుంటున్నారు. 63 ఎకరాల భూములు దేవునిపేరున రికార్డుల్లో నమోదైఉన్నా, ఒక ఎకరా కూడా దేవదాయశాఖ ఆధీనంలో లేదు. ఆలయ భూములకు 1బీ, అడంగల్‌లో చెన్నకేశవస్వామి పేరున భూములు ఉండి, పట్టాదార్ పాసుపుస్తకాలు కూడా ఉన్నాయి. అభూములను సాగుచేసుకుంటున్న రైతులు తమ వద్ద సెటిల్‌మెంట్ పట్టాలన్నాయంటూ వాటిని అనుభవిస్తున్నారు. కొందరు స్వార్థపరులు తమకున్న రాజకీయ పలుకుబడితో దేవుడి భూములను ఆక్రమించుకుని దర్జాగా పంటలు సాగుచేసుకుంటున్నా దేవదాయ శాఖ అధికారులు మిన్నకుండటం ఆరోపణలు తావిస్తోంది.

చందాలు వేసుకుని ఆలయ పునర్నిర్మాణం

మన్నేపల్లి చెన్నకేశవస్వామికి 63 ఎకరాల మాన్యం భూములున్నా దేవదాయశాఖ అభూములను స్వాధీనం చేసుకుని కౌలు కూడా వసూలు చేయడం లేదు. పురాతన కాలంతో నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయం పూర్తిగా శిథిలమైంది. దేవదాయశాఖ చుట్టూ తిరిగినా ఆలయ అభివృద్ధి గురించి పట్టించుకోపోవటంతో గ్రామస్థులు చందాలు వసూలుచేసి ఆరేళ్ల క్రితం పునర్నిర్మించారు. అప్పటి నుంచి దూపదీప నైవేద్యాలు, ఉత్సవాలకు దాతలపై ఆధారపడాల్సి వస్తుందని గ్రామస్థులు చెప్తున్నారు. ఈవిషయమై తాళ్లూరు మండల దేవదాయశాఖ ఈవో జి.వాసుబాబును వివరణకోరగా... మన్నేపల్లి చెన్నకేశవస్వామి ఆలయానికి రెగ్యులర్ ఈవో లేరన్నారు. ఆలయానికి రెవెన్యూ రికార్డుల మేర 63 ఎరాల మాన్యం భూమి ఉన్నట్లు 1బీ అడంగల్, పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్నాయన్నారు. రెగ్యులర్ ఈవో నియామకం జరిగితే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని చెప్పారు.

ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వం పలు మార్గదర్శకాలతో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అటువంటి తప్పిదాలకు తావులేకుండా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా దిశానిర్దేశం చేశారు. దీంతో తదనుగుణంగా బదిలీలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. గతేడాది పరిమితంగా కేవలం 15 శాఖల్లో మాత్రమే బదిలీలు చేపట్టగా ప్రస్తుతం అన్నిశాఖల్లో ఈ ప్రక్రియ జరగనుంది.

సిఫార్సు లేఖల జోరు

ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల వారీగా ముఖ్యనాయకుల నుంచి సిఫార్సు లేఖలు కూడా అధికారులకు అందాయి. ఆయా శాఖల్లో ఏ ఉద్యోగి ఎప్పటి నుంచి పనిచేస్తున్నారు, నూతన ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకుండా ఉన్న వారి జాబితాలను సిద్ధం చేశారు. అటువంటి వారందరినీ కూడా ఈసారి బదిలీ చేయనున్నారు. ఇంకోవైపు ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ అయ్యేందుకు ప్రజాప్రతినిధుల నుంచి ప్రత్యేకంగా సిఫార్సు లేఖలను కూడా తెచ్చుకొని అధికారులకు ఇస్తున్నారు.

పంచాయతీలపై ప్రత్యేక దృష్టి

పంచాయతీరాజ్, రెవెన్యూ, జిల్లా పరిషత్, ఇంజనీరింగ్, ఇరిగేషన్ వంటి శాఖల్లో బదిలీలు భారీగా జరగనున్నాయి. గతేడాది జరిగిన బదిలీల్లో జిల్లా పంచాయతీలో అప్పటి ప్రజాప్రతినిధుల సిఫార్సులకు అనుగుణంగా బదిలీలు జరక్కపోగా అప్పటి అధికారి, సిబ్బంది ఇష్టానుసారంగా బదిలీల ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై కలెక్టర్ సమగ్ర విచారణకు అదేశించారు. ఇందులో సుమారు 140మందికిపైగా ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా స్థానచలనం కల్పించినట్లు తేలింది. ప్రస్తుత బదిలీల్లో అటువంటి తప్పిదాలు జరగకుండా ఆ శాఖ అధికారి ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

మార్గదర్శకాలు అందలేదు

వైద్యారోగ్యశాఖలో గత ఏడాది బదిలీలు జరగ లేదు. ప్రస్తుతం ఆ శాఖలో కూడా భారీగా డాక్టర్లు, ఉద్యోగుల మార్పులు జరగనున్నాయి. ప్రభుత్వం బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ఇంకా ఆ శాఖ నుంచి మార్గదర్శకాలు రాలేదు. అవి వచ్చిన వెంటనే ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఇక రెవెన్యూలో కూడా తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. ఇప్పటికే ఉద్యోగులు తమకు అనుకూలమైన స్థానాలు పొందేందుకు సిఫార్సు లేఖలను తెచ్చుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అధికార పార్టీ ప్రజాప్రతినిధులంతా కడపలో జరుగుతున్న మహానాడులో ఉన్నారు. అది ముగిసిన అనంతరం ఉద్యోగుల బదిలీలకు సంబంధిత శాఖల అధికారులు శ్రీకారం చుట్టే అవకాశం కనిపిస్తోంది.

ఓబీసీకి చేరిన సాగర్ జలాలు

(5వ పేజీ తరువాయి)

కాలువ 85/3 మైలుకు(ప్రకాశం సరిహద్దు) 1,793 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. అక్కడ నుంచి ఒంగోలు బ్రాంచ్ కాలువలకు 998 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ పరిమాణం బుధవారానికి మరింత పెరిగే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని దర్శి-1, 2, చందవరం-1, 2 చెరువులకు పంపింగ్ ద్వారా నీరు నింపేందుకు మోటార్లు సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పైర్లు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విడుదలైన నీటిని రైతులు పొరపాటున సాగునీరుగా భావించే అవకాశం ఉంది. అందువలన ఎన్‌ఎస్‌పీ అధికారులు సాగర్ కుడికాలువపై నిరంతరం పర్యటిస్తూ రైతులకు సూచనలు ఇస్తున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన నీరు కేవలం తాగునీటి చెరువులకు నింపేందుకు మాత్రమేనని ఎన్‌ఎస్‌పీ డీఈలు అక్బర్‌బాష, మోహన్‌రావులు తెలిపారు నీటి దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.





తటాకంలో తాబేళ్ల సందడి!

నగరంలోని రంగారాయుడు చెరువు ఆహ్లాదంగా మారింది. రెండో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులో ఉన్న కొద్ది నీటిని చెరువుకు వదిలారు. నీటితోపాటు భారీగా తాబేళ్లు వచ్చాయి. అవన్నీ ఒడ్డుకు చేరడంతో వాటిని చూసేందుకు వచ్చిన వాకర్స్‌తో అక్కడ కోలాహలం నెలకొంది. తాబేళ్లు, చేపలకు ప్రజలు ఆహారం వేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



శింగరకొండ వద్ద ఉన్న కనిగిరి బస్సు

శింగరకొండకు ఇతర డిపోల నుంచి బస్సులు

● దూర ప్రాంత ప్రయాణికులు నేరుగా చేరుకునే అవకాశం

అద్దంకి, మే27 (ఆంధ్రజ్యోతి): శింగరకొండకు వచ్చే భక్తుల కోసం ఇతర డిపోల నుంచి కూడా కొత్తగా బస్సులను ఏర్పాటు చేశారు. పొదిలి, ఒంగోలు డిపోల నుంచి ప్రతి మంగళ, శనివారం రోజులలో బస్సులు నడుపుతున్నారు. పొదిలి డిపో బస్సు ఆయా రోజులలో కనిగిరిలో ఉదయం 8-15 గంటలకు బయలుదేరి పొదిలి, దర్శి, అద్దంకి మీదుగా శింగరకొండకు 11 గంటలకు చేరుకుంటుంది. శింగరకొండలో 11-30 గంటలకు బయలుదేరి సాయంత్రం 2-35 గంటకు చేరుకుంటుంది. మరలా కనిగిరిలో 2-50 గంటలకు బయలుదేరి శింగరకొండకు 5-35 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో శింగరకొండలో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి రాత్రి 8-50 గంటలకు కనిగిరి చేరుకుంటుంది. ఒంగోలు డిపో నుంచి ఉదయం, సాయంత్రం సమయాలలో శింగరకొండ వరకు బస్సును నడుపుతున్నారు.

వేలం షెడ్యూల్ ప్రకారం బేళ్లు తేవాలి



పకీర్‌పాలెం ఎన్టీఆర్ లేఅవుట్‌లో పర్యటిస్తున్న గృహనిర్మాణశాఖ డీజీఎం అన్నపూర్ణ

ఒంగోలు (రూరల్) మే 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో 7వ రౌండ్ షెడ్యూలు ప్రకారం పొగాకు బేళ్లు తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి తులసి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ ప్రతి బ్యారన్‌కు 3 బేళ్లు మాత్రమే తీసుకు రావాలన్నారు. 28వ తేదీన పోతవరం, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డిపాలెం, మామిడిపాలెం, యరజర్ల, 29న ఒంగోలు, గుత్తికొండవా రిపాలెం, అనుబ్రోలు వారిపాలెం, కేశినేని వారి పాలెం, ప్రాసంగలపాడు, ఉప్పుగుండూరు, చదలవాడ, కొప్పోలు, సూరారెడ్డిపాలెం, 30న అమ్మనబ్రోలు, చవటపాలెం, రాపర్ల, మాచవరం, 31న నాగులుప్పలపాడు, ఒమ్మెవరం, ఓబన్నపాలెం, మండవవారిపాలెం, ముక్తినూతలపాడు గ్రామాల రైతులు పొగాకు బేళ్లను వేలంకు తీసుకు రావాలన్నారు.

గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

● డీజీఎం అన్నపూర్ణ

సింగరాయకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆ శాఖ డీజీఎం ఎస్.అన్నపూర్ణ సూచించారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధి పకీర్‌పాలెంలోని లేఅవుట్‌ను మంగళవారం ఆమె పీడీ పి.శ్రీనివాసప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందజేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం నిర్మాణంలో ఉన్నవి పూర్తి చేసుకొనేందుకు బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు, చెంచులకు రూ.లక్ష అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం కాలనీలోని సమస్యలను తెలుసుకున్నారు.

నంబరు 83310 57095

● పొగాకు రైతుల కోసం టోల్‌ఫ్రీ ఏర్పాటు

పర్చూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): చేతికి అందివచ్చిన బర్లీ పొగాకు కొనుగోలు జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. ఆయా కంపెనీల ఆధ్వర్యంలో కొనుగోలు చేసేవిధంగా ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలను కూడా జారీచేసింది. రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కొనుగోలు జరిగే విధంగా ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకునే విధంగా 83310 57095 టోల్‌ఫ్రీ నెంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ మోహనరావు తెలిపారు. బాపట్ల జిల్లా పరిధిలోని నాలుగు సబ్‌డివిజన్‌లైన పర్చూరు, మార్టూరు, అద్దంకి, చీరాలలోని 12 మండలాలకు సంబంధించిన వివిధ కంపెనీలకు పొగాకు అమ్మేందుకు ఏమైన సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ షాపుల్లోనే సరుకులు

● పాత పద్ధతిలో పంపిణీకి ఏర్పాట్లు ● దుకాణంతో పాటు ఐదు రకాల ఫొటోలు తీసి అప్‌లోడ్

● ఈ-పౌర సరఫరా యాప్‌లో వివరాలు పొందుపరుస్తున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు నిత్యవసర సరుకులను సాంకేతిక పరిజ్ఞానంతో అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకోసం ప్రత్యేక యాప్‌ను అమలు చేస్తోంది. వచ్చేనెల 1వ తేదీ నుంచి ఎండీయూ వాహనాల స్థానంలో సాంకేతిక పరిజ్ఞానంతో రేషన్‌షాపుల ద్వారా బియ్యం, ఇతర నిత్యవసర సరుకులను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా జిల్లాలో పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. రేషన్ పంపిణీ చేసేందుకు మరో వారం రోజులు మాత్రమే సమయం ఉండటంతో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎస్.పద్మశ్రీ ఆధ్వర్యంలో ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు చర్యలు ప్రారంభించారు. జిల్లాలో 1392 రేషన్‌షాపులు ఉండటంతో ఆ షాపుల వివరాలన్నింటినీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఈ-పౌరసరఫరా యాప్‌లో నమోదు ప్రక్రియను చేపట్టారు. ఆ రేషన్‌షాపు లోకేష్‌తో పాటు రేషన్‌షాపు, లోపలి భాగం తదితర మొత్తం ఐదు రకాల ఫొటోలు తీసి ఆ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వాటన్నింటినీ అప్‌లోడ్ చేసిన తర్వాత ఓటీపీ నెంబర్ వస్తోంది. నెంబరు వచ్చిన తర్వాత అందులో నమోదు చేస్తున్నారు. అనంతరం రేషన్ డీలర్‌కు కూడా ఆ యాప్‌ను నమోదు చేస్తున్నారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ రేషన్‌షాపుల డీలర్ల అసోసియేషన్లు, రేషన్ షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పౌరసరఫరాలశాఖ అధికారులు దీనికి సంబంధించి ప్రక్రియను చేపట్టారు. ఆ శాఖ అధికారులే స్వయంగా ఆయా రేషన్‌షాపులను సందర్శించి యాప్‌లను డౌన్‌లోడ్ చేయాలని ఆదేశించడంతో డీఎస్‌వో పద్మశ్రీతో పాటు ఇతర అధికారులందరూ ఈ పనిలో నిమగ్నమయ్యారు. ఒంగోలులోని పలు రేషన్‌షాపులను డీఎస్‌వో పద్మశ్రీ సందర్శించి స్వయంగా ఆమె ఆయాప్‌ను డౌన్‌లోడ్ చేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఫొటోలు, ఇతర అంశాలను అప్‌లోడ్ చేసే ప్రక్రియను చేపట్టారు. ఈప్రక్రియ నాలుగైదు రోజుల్లో ముగియనున్నట్లు తెలుస్తోంది.



ఈ-పౌర సరఫరా యాప్‌లో రేషన్‌షాపు వివరాలను అప్‌లోడ్ చేస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

అన్నదాత సుఖీభవ అర్హుల గుర్తింపును వేగవంతం చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వచ్చేనెలలో ఈ పథకం లబ్ధిదారుల ఖాతాలో నిధులను ప్రభుత్వం జమ చేయనుందన్నారు. అందువల్ల క్షేత్రస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. అన్నదాన సుఖీభవ, సీసీఆర్ కార్డుల మంజూరుపై దిశా నిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ సీబీజీ, ఎంఎస్‌ఎంఈ, ఇతర పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములను రెవెన్యూ అధికారులు గుర్తించాలని ఆదేశించారు. అర్హులైన వారు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్, వరకుమార్, జాన్సన్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

● మహిళా శక్తిని సమాజ చోదకశక్తిగా మార్చాలి

మహిళా శక్తి కుటుంబాన్ని సమాజ చోదకశక్తిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. బ్యాంకర్లు కూడా స్వయంసహాయక సంఘాల సభ్యులకు ఈ దిశగా రుణాలు ఇచ్చి అండగా నిలువాలన్నారు. డ్వాక్రా మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇచ్చే వార్షిక రుణం, జీవనోపాధి కార్యచరణ ప్రణాళికపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా జనాభాలో నాలుగో వంతుగా సుమారు నాలుగున్నర లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఉన్నారన్నారు. లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలను తయారుచేసే క్రమంలో జూన్ 5వతేదీన జిల్లాలో 1720 యూనిట్లు అందుబాటులోకి రావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. అందుకు సుమారు రూ.23 కోట్ల రుణాలు అవసరమని అధికారులు గుర్తించినందున సత్వరమే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

● రూ.6559 కోట్లరుణ ప్రణాళిక

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.6759.13 కోట్ల రుణ ప్రణాళికను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆమోదించారు. రుణాల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆమోదించడమో, తిరస్కరించడమో చేయాలి తప్ప పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. కొత్త యూనిట్ల కోసం మంజూరైన రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం రుణ ప్రణాళిక పోస్టర్‌ను కలెక్టర్, ఇతర బ్యాంకు అధికారులు ఆమోదించారు.

30న ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు, కార్పొరేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన జిల్లాస్థాయి స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్టు సెక్రటరీ రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సంతపేటలోని డీఆర్‌ఆర్‌ఎం స్కూలు క్రీడా మైదానంలో జరిగే ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు.

ముగిసిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

● 31నుంచి మూల్యాంకనం

ఒంగోలు విద్య, మే 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారంతో ముగి శాయి. చివరగా ఓఎస్‌ఎస్‌సీ కాంపోజిట్ కోర్సు పరీక్ష జరిగింది. మంగళవారం 14 పరీక్షా కేంద్రాల్లో 39 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 26 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం ఈనెల 31 నుంచి స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో జరగనుంది. మూల్యాంకనం కేవలం మూడు రోజులు మాత్రమే జరుగుతుంది. జూన్ 2న ముగుస్తుంది. జిల్లాతో సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల సంస్కృతం పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం ఒంగోలులోనే జరుగుతుంది.

హెచ్‌ఎం ఉద్యోగోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు విద్య, మే 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపరిషత్, మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల్లో ఖాళీగా ఉన్న 88 హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేసేందుకు మంగళవారం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం స్కూలులో సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లాపరిషత్ యాజమాన్యంలో 120 మందికి, మునిసిపల్ యాజమాన్యంలో 12 మందికి, మునిసిపల్ కార్పొరేషన్‌లో ముగ్గురు స్కూలు అసిస్టెంట్ల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. మిగిలిన 129 మందివి బుధవారం పరిశీలన చేస్తారు. మొదటి రోజు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన వారిలో కొందరు హెచ్‌ఎం ఉద్యోగోన్నతులపై ఆసక్తి చూపలేదని చెప్పారు.

భవనాసిలో చేపలవేట ప్రారంభం

● రెండు నెలలు మత్స్య సంపద సేకరణ ● తామర, తూటుకాడతో చేపల్లో కొరవడిన ఎదుగుదల ● నిరుత్సాహంలో జాలర్లు



చేపలు నిల్వ చేసేందుకు తెచ్చిన ఐస్‌బాక్స్‌లు

అద్దంకి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పెద్దచెరువులలో ఒకటిగా ఉన్న భవనాసి చెరువులో చేపలవేట ప్రారంభమైంది. సుమారు రెండునెలల పాటు జాలర్లు చేపల వేట సాగించనున్నారు. ఇప్పటి వరకు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో చేపలు మాత్రం అందుబాటులో ఉండగా ప్రస్తుతం భవనాసి చెరువులో కూడా వేట ప్రారంభమైంది. దీంతో మాంసం ప్రియులకు పండగనే చెప్పాలి. అయితే ఈ ఏడాది భవనాసిలో చేపల ఎదుగుదల అంతంత మాత్రంగానే ఉంది. దీంతో జాలర్లు ఒకింత నిరుత్సాహానికి గురవుతున్నారు. అదేసమయంలో ధర కూడా అంత ఆశాజనకంగా లేదని అభిప్రాయపడుతున్నారు. భవనాసి చెరువులో వేట సాగించే జాలర్ల కుటుంబాలు 200 వరకు ఉండగా, ఎక్కువ మంది గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్తూ భవనాసిలో వేటకు రావటం లేదు. దీంతో సగం మంది మాత్రమే వేట సాగిస్తున్నారు. భవనాసిలో చేపలు ఎదుగుదల లేకపోవడంతో వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. చేపలు ఎదుగుదల లేకపోవడానికి ప్రధాన కారణం చెరువులో పెరిగిన తూటు, తామరగా జాలర్లు భావిస్తున్నారు. చెరువులో తూటు కాడ, తామర ఆకు ఏటికేడు పెరిగి పోతోంది. దీంతో మత్స్య సంపద ఎదుగుదల లేకుండా పోతుందని జాలర్లు అభిప్రాయపడుతున్నారు. చేపపిల్లలను ఆలస్యంగా వేయడం కూడా ఎదుగుదల తక్కువగా ఉండటానికి మరొక కారణంగా భావిస్తున్నారు.

వేట ఆశాజనకంగా లేదు

భవనాసి చెరువులో చేపల వేట అంత ఆశాజనకంగా లేదు. చెరువులో నాచు, తూటు కాడా ఎక్కువగా పెరగడంతో చేపలు ఎదుగుదల లేకుండా పోయాయి. దీంతో భవనాసి చెరువులో చేపల వేట సాగించేందుకు ఎక్కువ మంది జాలర్లు ఆసక్తి చూపటం లేదు.

-లక్ష్మీపతి, జాలరి, కలవకూరు, అద్దంకి మండలం

అవీ..ఇవీ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చుండూరి రంగారావు తదితరులు

పాలస్తీనా ముఖచిత్రం పుస్తకావిష్కరణ

ఒంగోలు కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి):పాలస్తీనా పరిస్థితులను కళ్లకుకట్టినట్లు చూపించే పాలస్తీనా ముఖచిత్రం పుస్తకావిష్కరణ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో జరిగింది. సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి అధ్యక్షతన జరిగిన సభలో సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కన్వీనర్ డీవీఎస్ స్వామి మాట్లాడుతూ అమెరికా అండదండలతో ఇజ్రాయిలీ జాత్యహంకారులు అమానుషంగా పాలస్తీనా ఆస్పత్రులపై, ప్రజా స్థావరాలపై దాడులు చేస్తున్నారని గత సంవత్సర కాలంలో గాజాలో 50వేల మంది మరణిస్తే అందులో 15,600 మంది చిన్నపిల్లలు ఉన్నారన్నారు. జనసాహితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జీవీ కృష్ణయ్య మాట్లాడుతూ 77 ఏళ్లుగా పాలస్తీనాను అతలాకుతలం చేస్తున్నారని, పిల్లలు, మహిళలను లక్ష్యంగా చేసుకుని జాతి నిర్మూలన యుద్ధం కొనసాగుతున్నదని అన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్జేసీ విశ్రాంత అధ్యాపకులు ఎం.విజయ్ భాస్కర్ రెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు పరిటాల కోటేశ్వర రావు, వాటంపేడు శ్రీరాములు, కోడూరి కోటేశ్వర రావు, బెజవాడ శివరామ కృష్ణయ్య, జయబాబు, గుళ్లాపల్లి వెంకట్రావు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు టి.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ భవాని

బాధితులకు పౌష్టికాహారం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కుష్ఠు నివారణ కేంద్రంలో పది మంది హెచ్ఐవీ బాధితులకు డీఎల్‌ఏటీవో డాక్టర్ బి.భవాని పౌష్టికాహార ప్యాకెట్లను అందజేశారు. హెచ్ఐవీ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి సొసైటీ ద్వారా ప్రతినెలా పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. కిరణ్, చంద్రమోహన్, సొసైటీ సెక్రటరి సీహెచ్‌వీ రాఘవ, సీహెచ్ శ్రీనుబాబు, నాగరాజు, ఎస్‌కే పీరుబాష తదితరులు ఉన్నారు.



ఆర్‌ఎల్ పురం చెత్తసంపద కేంద్రం వద్ద డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు, ఇతరసిబ్బంది

పారిశుధ్య పనుల్లో ప్రథమ స్థానంలో నిలవాలి

● డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు

చీమకుర్తి,మే27(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల నిర్వహణలో ఆర్‌ఎల్ పురం పంచాయతీని రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిపేవిధంగా కార్యక్రమలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు కోరారు.మంగళవారం గ్రామ పరిధిలో చెత్తసంపద కేంద్రం వద్ద నిర్వహిస్తున్న పనులను ఆయన పరిశీలించారు.గ్రామపంచాయతీలను పూర్తి స్థాయిలో పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు.సిబ్బందికి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.అజిత,పీఎస్ వెంకటేశ్వర్లు,సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్‌కు బొకే ఇస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సభ్యులు

కలెక్టర్‌ను కలిసిన నూతన కమిటీ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అధ్యక్షుడు కోమటిగుంట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కలెక్టర్ అన్సారియాకు బొకే ఇచ్చి అభినందించారు. ఈసందర్భంగా నూతన కమిటీ సభ్యులను కలెక్టర్‌కు పరిచయం చేశారు. అనంతరం నాల్గవతరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లాలో నాల్గవ తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రేమ్‌నాథ్, కోశాధికారి సుబ్బారాయుడు, ఇతర సభ్యులు నాగయ్య, యోబు, వెంకయ్య, రమాదేవి, దేవకుమారి తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డులో చెత్త ప్రాసెసింగ్

● పనుల ప్రారంభం

● పరిశీలించిన కమిషనర్



చెత్త ప్రాసెసింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు, కార్పొరేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : లెగసీ వేస్ట్ (పేరుకుపోయిన చెత్త)ని ప్రాసెసింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కమిషనర్ కే. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒంగోలు సమీపంలోని గుత్తికొండవారి పాలెం వద్ద డంపింగ్ యార్డు పనులను ఆయన పరిశీలించారు. తరుణి అసోసియేట్స్ ఆధ్వర్యంలో చెత్త ప్రాసెసింగ్ పనులు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. సుమారుగా 66 వేల టన్నుల లెగసీ వేస్ట్‌ని రాబోయే మూడు నెలల్లో పూర్తి చేసే విధంగా అసోసియేట్ వారు తెలియజేశారన్నారు. అందుకోసం ఆధునిక యంత్ర పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్లాస్టిక్‌ను వేరు చేసిన మిగిలిన చెత్త పొడిని రోడ్ల మీద ఉన్న గుంతలను పూడ్చడానికి ఉపయోగించవచ్చని తెలిపారు. అలాగే వేరు చేసిన ప్లాస్టిక్ చెత్తను జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి తరలిస్తామని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా వాయు కాలుష్యం, భూమి కాలుష్యం నివారించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ చంద్రయ్య, డీఈఈలు పద్మజ, అనీల్, ఏఈఈ సౌజన్య, తరుణి అసోసియేట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మురుగునీరు పారుదల మెరుగుకు చర్యలు

ఒంగోలు నగరంలో మురుగునీరు పారుదల మెరుగు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అందులో ప్రధానమైన పోతురాజు కాలువల్లో వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టినట్లు నగర కమిషనర్ కే. వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోతురాజు కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి ప్రధానమైన మురుగునీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయన్నారు. అయితే ఇవి తొలగింపునకు అనేక ఇబ్బందులు ఎదురవుతుండగా, నెల్లూరు జిల్లా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన భారీ ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. వర్షాల ప్రభావం కారణంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. అయితే కొన్నేళ్లుగా కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో వ్యర్థాల తొలగింపు కష్టతరంగా మారిందన్నారు. వారం రోజులుగా ప్రత్యేక చర్యలు చేపట్టి పారుదల వ్యవస్థను మెరుగుపరుస్తామని కమిషనర్ తెలిపారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



చీమకుర్తిలో రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

నాగులుప్పలపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్1 నుంచి రేషన్‌డీలర్లు తమ దుకాణాల వద్ద కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని మండల తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిధిలోని రేషన్‌డీలర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం వచ్చే నెల ఒకటి నుంచి రేషన్ సరుకులు అందించే ఎండీయూ వాహనాలను రద్దు చేసిన నేపథ్యంలో రేషన్‌డీలర్లు తమ చౌక దుకాణాల వద్దనే కార్డుదారులకు సరుకులు అందించాలని సూచించారు. ప్రతి నెల ఒకటవ తేదీ నుంచి 15 వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు అందించాలని చెప్పారు. పాత పద్ధతిలో సకాలంలో డీడీలు చెల్లించి రేషన్ సరుకులు దుకాణాలకు చేర్చుకోవాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రేషన్ సరుకులు నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా చేర్చుతారని చెప్పారు.ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి రేషన్‌దుకాణం వద్ద స్టాక్ బోర్డు,ధరల పట్టిక వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ పాల్గొన్నారు.

రేషన్‌షాపులపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు

సంతనూతలపాడు : మండలంలోని రేషన్‌షాపులపై లబ్ధిదారులనుంచి ఫిర్యాదులు వస్తే విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలపరిధిలోని రేషన్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఆమె సమావేశమై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లను రద్దు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. జూన్ 1నుంచి మండలంలోని గ్రామాల్లో రేషన్ డీలర్లు విధిగా షాపులను పారంభించాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జూన్ నెల నుంచి ముమ్మరంగా రేషన్‌షాపులపై తనిఖీలు ఉంటాయని తెలిపారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ, రెవెన్యూ కార్యాలయ సివిల్ సప్లై ప్రతినిధి ఎంవి.రమణ, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

డీలర్లు సమయపాలన పాటించాలి

చీమకుర్తి : రేషన్ డీలర్లు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని తహసీల్దార్ బ్రహ్మయ్య కోరారు.డీలర్లు ఆచరించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. జూన్ ఒకటో తేదీని పండుగ వాతావరణంలో ప్రజా ప్రతినిధుల ద్వారా దుకాణాల వద్ద రేషన్ సరఫరాను ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో డీటీ రాజ్యలక్ష్మి,ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీ,సీనియర్ అసిస్టెంట్ సురేష్, డీలర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో యోగాపై ప్రజలకు శిక్షణ ఇవ్వాలి



ఒంగోలు ఎంపీడీవో కార్యాలయం వద్ద మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ

ఒంగోలు(రూరల్), మే27(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ పొందిన వారు గ్రామాలలో ప్రజలకు యోగాలో శిక్షణ ఇవ్వాలని ఒంగోలు ఎంపీడీవో కె.రాజశేఖరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్దమంగళవారం ఉదయం యోగాపై మాస్టర్ శిక్షకులతో సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌వోలకు, పంచాయతీ కార్యదర్శులకు, అంగన్ వాడీ టీచర్‌లకు, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.రాజశేఖరరావు మాట్లాడుతూ యోగాతో పలు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ముఖ్యంగా ఇక్కడ శిక్షణ పొందిన వారు గ్రామాలలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు. ఈవోఆర్‌డీ ఎ.బాలచెన్నయ్య. పీఆర్ ఏఈ రామ్‌ప్రసాదు, ఎస్‌జీఎఫ్ జిల్లాకార్యదర్శి హజీరాబేగం, డిప్యూటీ తహసీల్దార్ జి.ఆశాజ్యోతి, ఆయుష్ అధికారి భీమనాథ్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

మద్దిపాడు : మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని ఎంపీడీవో శ్రీనివాస ప్రసాదరావు అన్నారు. మంగళవారం నటరాజ కళాకేంద్రం సచివాల ప్రాంగణంలో యోగాభ్యాసనం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించటం సంతోషదాయకమని, యోగాతో అనారోగ్య సమస్యలు దూరం చేసుకోవచ్చని అన్నారు. తహసీల్దార్ ఎస్. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టి యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ మోహన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

ఒంగోలు కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి):తెలుగువారి ఆత్మగౌరవం స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని కోటి వెలుగుల తెలుగు అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వర రావు మంగళవారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం కూడా కృషిచేయాలని అన్నారు. తెలుగు భాషకు, సంస్కృతి సంప్రదాయాలకు వన్నె తెచ్చిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని ఆయన అన్నారు. తెలుగువారి ఖ్యాతిని విశ్వవ్యాపితం చేయటమే కాకుండా ఇటు రాజకీయరంగంలో సైతం పేదవారి సంక్షేమం కోసం ఎన్టీఆర్ కృషిచేశారని డాక్టర్ కోటేశ్వర రావు అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నాగులుప్పలపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ రజియా సుల్తానా సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌వద్ద మండల పరిధిలోని ఆటో డ్రైవర్లకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోలను సరైన పత్రాలు లేకుండా నడపరాదని తెలిపారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'మరో గ్రంథాలయ ఉద్యమానికి' అంతర్జాతీయ అవార్డు

ఒంగోలు కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి):ఒంగోలు కేంద్రంగా ప్రారంభమైన మరో గ్రంథాలయ ఉద్యమానికి ఇంటర్నేషనల్ ఇంక్ బౌండ్ అవార్డు లభించినట్లు ఉద్యమ కన్వీనర్ మంచికంటి వెంకటేశ్వర రెడ్డి తెలపారు. కస్తూరి విజయం తెలుగు మాసపత్రిక ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు కేంద్ర మంత్రులు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారని వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేకమంది సాహితీవేత్తలు ఈ సభలో పాల్గొంటారని, మరో గ్రంథాలయ ఉద్యమం తరుపున తాను ఈ అవార్డును అందుకోనుండటం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. కాగా మరో గ్రంథాలయ ఉద్యమ కన్వీనర్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డు లభించటం పట్ల డాక్టర్ కొర్రపాటి సుధాకర్, కాంతి నల్లూరి, ఓపీడీఆర్ చావల సుధాకర్ రావు, తేళ్ల అరుణ, పొన్నూరి శ్రీనివాసులు, కుర్రా ప్రసాద్ బాబు, పి.పేరయ్య తదితరులు అభినందనలు తెలిపారు.

దళిత యువకులపై దాడి దారుణం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్

ఒంగోలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని మాజీమంత్రి, కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. తెనాలిలో దళిత యువకులపై పోలీసులు పైశాచికంగా దాడులు చేయడం దుర్మార్గంగా ఉం దన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముగ్గురు యువకులను సభ్యసమాజం తలదించుకోనే విధంగా పబ్లిక్‌గా థర్డ్ డిగ్రీని ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నా హోంమంత్రి కానీ, ప్రభుత్వంకానీ పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైసీపీ నాయకులు కాకుమాను రాజశేఖర్, కే కనకారావు, దేవ ప్రసాద్, సుల్తాన్‌బాషా, ఇమ్రాన్, వేమా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘన

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్ రావు ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెనాలిలో దళిత, మైనార్టీ యువకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సభ్యసమాజం తలదించుకోవాలన్నారు. ఈ ఘటనకు పాల్పడిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పొగాకు కొనుగోళ్లలో ద్వంద వైఖరి

పొగాకు కొనుగోళ్ల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వందవైఖరిని అవలంబిస్తున్నారని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు విమర్శించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బర్లీ పొగాకు రైతులను ఆదుకోనేందుకు రూ .130 కోట్లు మంజూరు చేస్తానని, అవసరమైతే మార్క్‌ఫెడ్ రంగంలోకి వస్తుందని మౌఖిక ఆదేశాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు.పొగాకు కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్‌కు నిధులు కేటాయిస్తే లాభం వస్తుంది తప్ప నష్టంరాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నిదులు కేటాయించి పొగాకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు తమ్ముళ్లు

ఎమ్మెల్యే జనార్దన్‌కు సలహా ఇచ్చే స్థాయా నీది !

● జడా బాల నాగేంద్రపై తెలుగు తమ్ముళ్ల ధ్వజం

ఒంగోలు, కార్పొరేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఎన్నికల్లో ఎవరు ఎక్కడ పోటీ చేయాలో.. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు సలహా ఇచ్చే స్థాయి జనసేన నాయకుడు జడ బాలనాగేంద్ర యాదవ్‌కు లేదని తెలుగు తమ్ముళ్లు ధ్వజమెత్తారు. మంగళవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు రోజులుగా జడ బాల నాగేంద్ర స్థాయికి మించి హద్దులు దాటి మాట్లాడుతున్నాడని అన్నారు. ఆయన నోరు అదుపులో ఉంచుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం హయాంలో తెలుగుదేశం పార్టీ వారిపై దాడులు చేస్తే జనసేన నాయకుడుగా ఏమయ్యావు అని ప్రశ్నించారు. తమ పార్టీ నాయకుడు మేడికొండ మోహన్‌పై దాడి చేస్తే ప్రతి జనసేన కార్యకర్త తమకు అండగా ఉన్నారని అన్నారు. అప్పుడు నీవు ఎక్కడికెళ్లావు అని ప్రశ్నించారు. జనసేనలో ఉండి బాలినేని మెప్పు కోసం మాట్లాడవద్దని ఆయన సూచించారు. బాలినేని, దామచర్ల కలిసి పనిచేయాలని చెప్పడానికి నీకేం అర్హత ఉందని వారు ప్రశ్నించారు. ఎమ్మెల్యే దామచర్లను ఏకవచనంతో మాట్లాడినా, ఎమ్మెల్యేపై విమర్శలు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మీడియా సమావేశంలో టీడీపీ మీడియా కోఆర్డినేటర్ స్వరూప్, నగర ఉపాధ్యక్షుడు బోడపాటి వెంకట్, ఒంగోలు నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరు తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

పొగాకు రైతులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులను ఆత్మహత్యల బారి నుంచి కాపాడేందుకు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం జరిగిన రైతు సంఘం జిల్లాకమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ పొగాకు కంపెనీలు కొనుగోళ్లు చేయకపోవడంతో ఇప్పటికే నల్లబర్లీ రైతులు నలుగురు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఈ విధంగా కొనసాగితే ఇంకా ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ వర్జీనియా పొగాకు రేట్లు క్రమంగా తగ్గుతున్నాయన్నారు. లో గ్రేడ్‌ను అసలు కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వరంగ సంస్థలను రంగంలోకి దించి పొగాకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసరావు, కిష్టిపాటి చిన్నపురెడ్డి, కనపర్తి సుబ్బారావు, శ్రీకాంత్, ఉషా, వెంకటేశ్వర్లు, సోమయ్య, నరసింహారావు, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో మినీ లారీ డ్రైవర్ మృతి

ఒంగోలు క్రైం,మే 27(ఆంధ్రజ్యోతి):ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి మినీ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మినీ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో త్రోవగుంట సమీపంలో జాతీయ రహదారిపై ఫ్లైవోవర్ బ్రిడ్జి వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో చిత్తూరు జిల్లా రామసముద్రం మండలం పెదకూరపల్లికి చెందిన మినీ లారీ డ్రైవర్ బందర్ల ప్రసాద్ (36) మృతి చెందాడు. వివరాలలోకి వెళితే రాజమండ్రి నుంచి పీలేరుకు మామిడి మొక్కల లోడుతో మినీ లారీ వెళుతోంది.ముందుగా మినప గుళ్లలోడుతో వెళుతున్న లారీని మినీ లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో మినీ లారీ డ్రైవర్ ప్రసాద్ త్రీవరంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఈమేరకు తాలుకా పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్

● నలుగురికి గాయాలు

ఒంగోలు క్రైం,మే 27(ఆంధ్రజ్యోతి):పొగాకు లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కంటైనర్ ఢీ కొట్టడంతో నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం జాతీయ రహదారిపై తూర్పు నాయుడుపాలెం సమీపంలో బాబాయ్ హోటల్ వద్ద జరిగింది. సూరారెడ్డిపాలెంనకు చెందిన నల్లగొర్ల అశోక్ ట్రాక్టర్ పై పచ్చాకు వేసుకొని కూలీలను పైన ఎక్కించుకొని తూర్పునాయడు పాలెం వెళుతున్నారు. ఒంగోలు నుంచి చెన్నై వెళుతున్న కంటైనర్ ఢీ కొట్టింది. దీంతో కూలీ వెంకటేశ్వర్లుకు కాలు విరిగింది. జక్రయ్య, మార్కు, రాములుకు స్వల్పగాయాలు అయ్యాయి. అయితే ఢీ కొట్టిన కంటైనర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు చిల్లకూరు వద్ద కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. టంగుటూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కారు

● ఐదుగురికి గాయాలు

● క్షతగాత్రులు భద్రాచలం వాసులు

మద్దిపాడు, మే 27(ఆంధ్రజ్యోతి): లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం దొడ్డవరప్పాడు - పెద్దకొత్తపల్లి మధ్యలో చోటు చేసుకుంది. గుంటూరు వైపు వెళ్లే లారీని వెనుక వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ సంఘటనలో తెలంగాణలోని భద్రాచలంకు చెందినబి.సీన్న, వి.జ్యోతి, బి.అరుణ, బి.హరిలాల్, బి.బాలులకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలాగే గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పిన ఘటనలో మహిళకు గాయాలయ్యాయి. అద్దంకి పట్టణానికి చెందిన ఆర్.రమ్యకృష్ణ తన ద్విచక్ర వాహనంపై ఒంగోలు నుంచి అద్దంకి వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం మేదరమెట్ల వైద్యశాలకు తరలించారు.

దేవాలయాన్ని అభివృద్ధి చేయాలి

గిద్దలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నల్లబండ బజారులో గల దుర్గమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పిడతల రమేష్‌రెడ్డి దేవాదాయ శాఖ అధికారులకు వినతిపత్రం పంపారు. దాతల సహకారంతో నిర్మించిన దేవాలయంలో ఇటీవల కాలంలో ధూప దీప నైవేద్యాలకు కూడా ఇబ్బందికరంగా ఉన్న దృష్ట్యా ప్రాముఖ్యమైన ఈ దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రికార్డుల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ

గిద్దలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : సాధారణ తనిఖీలలో భాగంగా రాచర్ల పోలీసు స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులను రూరల్ సీఐ రామకోటయ్య తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహన చోదకులకు తరచూ కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు.

వర్షాలతో పత్తి సాగుకు ఆటంకం

- కలుపు మొక్కలకు అనుకూలంగా వాతావరణం
- ఎదుగుదల లోపం
- తగ్గిన మొలక శాతం



సాగు చేసిన పత్తి పైరు

పెద్ద దోర్నాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : పత్తి సాగుకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. అకాల వర్షం కారణంగా రోజూ కురుస్తున్న మోస్తరు జల్లులు మండలంలో సాగు చేసిన వేసవి పత్తి ఎదుగుదలకు ప్రతిబంధకాలుగా మారాయి. ప్రధానంగా కలుపు పైరుతో పాటు పెరుగుతోంది. నాటిన పత్తి విత్తనాలు సరిగ్గా మొలవడం లేదు. మొలిచినా అవి ఆరోగ్యంగా ఎదగలేకపోతున్నాయి. ఒకసారి నాటిన విత్తనాలు ఒకే సారి మొలవడం లేదు సరికదా మొలిచిన మొక్కలు ఆకులు పచ్చగా మారి ముడుచుకు పోతున్నాయి. మరి కొన్ని విత్తనాలు వాన నీటికి కొట్టుకుని పోవడం. ఇంకొన్ని విత్తనాలపై మట్టి చేరుకోవడంతో అవి భూమిలోపలే ఉండిపోతున్నాయి. దీంతో పైరు సక్రమంగా కనిపించడం లేదు. మళ్లీ మళ్లీ నాటాల్సి వస్తోంది. ఈ లోపు వాతావరణం చల్లగా ఉండడంతో పాటు అప్పుడప్పుడు కురుస్తున్న జల్లులకు తేమ శాతం ఎక్కువై కలుపు మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. పైరు ఎదుగుదలకు అవాంతరంగా మారుతున్నాయి. బురద పదునుకు అంతర సేద్యం, కలుపుతీతలు వీలుపడక పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొన్ని రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంపై బెంబేలెత్తి పోతున్నారు. యూరియా వంటి ఎరువులు ఏమైనా చల్లుదామంటే కలుపు పెంచిన వారమవుతామని భయపడుతున్నారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లో ఏప్రిల్ చివరి రోజుల్లో, మే మొదటి వారంలో పత్తి విత్తారు. వివిధ దశల సాగులో ఉన్న పత్తి పైరుకు నాటిన మొదటి రోజుల్లో బోరుబావుల్లో నీరు లభ్యత తగ్గి పత్తికి నీటితడులు ఇచ్చేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమయంలో అకాల వర్షం కురవడం సంతోషాన్నిచ్చింది. అయితే ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదు. రోజూ కురుస్తున్న నాన్పుడు వానకు పైరుకు నష్టం ఏర్పడుతుండడంతో నెల రోజుల కష్టం, సొమ్ము వృథా అవుతుందేమోనని బాధ పడుతున్నారు. వాగులు వంకలు, చెరువులు, కుంటలు నిండే విధంగా పెద్దగా వాన కురిసిపోతే బాగుండునని పత్తి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అతిథులు

కందుకూరికి ఘన నివాళి

గిద్దలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాల్యవివాహాల నిర్మూలన కోసం ఉద్యమించిన సంఘ సంస్కర్త, మూఢనమ్మకాలపై యుద్ధం ప్రకటించిన కందుకూరిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో న్యాయవాది డి.సిద్ధయ్య, గ్రంథపాలకురాలు ఎన్.ప్రసన్నకుమారి, రిటైర్డ్ హెచ్ఎం రామిరెడ్డి, పారా లీగల్ వాలంటీర్ మధుసూదన్‌రావు, యువప్రగతి పథం వ్యవస్థాపకులు ఫరూక్ పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి యువకుడు మృతి



అఖిల్ మృతదేహం

ఎర్రగొండపాలెం రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం - మాచర్ల రోడ్డులోని జాతీయ రహదారి, కొత్తపల్లి గ్రామ సమీపంలోని రెస్ట్ రూమ్ ఎదురుగా రైతులు ఏర్పాటు చేసిన నీటి కుంటలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వీరభద్రాపురం ఎస్సీ పాలెంకు చెందిన ఆలేటి అఖిల్ (20) సమీపంలోని గుడిలో బెల్దారి పనులకు వచ్చాడు. మధ్యాహ్నం భోజన సమయంలో కాళ్లు చేతులు కడుక్కునేందుకు కుంట వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు జారి పడి మృత్యువాత పడినట్లు తెలిపారు. మిగిలిన కూలీలు పనులకు వచ్చే సమయానికి యువకుడు కనిపించకపోవంతో చుట్టుపక్కల పరిశీలించారు. నీటి కుంట వద్ద చెప్పులను గమనించిన తోటి కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో కలసి నీటి కుంటలో ఉన్న అఖిల్ మృతదేహాన్ని బయటకు తీశారు. తల్లి యోగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు. అఖిల్ స్థానిక కళాశాలలో డీఎంఎల్‌టీ చదువుతున్నట్లు బంధువులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి



వెంకటేశ్వర్లు మృతదేహం



వెంకటేశ్వర్లు

మార్కాపురం రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పాయపాలెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కారు బైక్ ఢీకొని టీడీపీ కార్యకర్త పోతిరెడ్డి వెంకటేశ్వర్లు (30) మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డి వెంకటేశ్వర్లు బైక్‌పై కంభంకు వ్యక్తిగత పనుల నిమిత్తం వెళుతున్నారు. అదే సమయంలో కంభం వైపు నుంచి కుంట వైపునకు కారు వస్తుంది. మండలంలోని తిప్పాయపాలెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కారు బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు పంచాయతీ శివాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు టీడీపీ కార్యకర్తగా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని, మహానాడు ముగింపు సభకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న క్రమంలో ఈ ప్రమాదం జరిగి మృతి చెందారని గ్రామ టీడీపీ నాయకులు తెలిపారు. అతనికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని రూరల్ ఎస్ఐ అంకమ్మరావు, ఏఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృత దేహాన్ని శవ పంచనామా నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు.

మహిళ ఆత్మహత్య

దర్శి, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పువీరాయపాలెంలో మంగళవారం మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ మురళి కథనం ప్రకారం.. సీహెచ్ వెంకటరత్నం(30) భర్త మందలించడంతో మనస్తాపం చెంది, ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వెంకటరత్నం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గంజాయి విక్రేత అరెస్టు

ముండ్లమూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గంజాయి విక్రయానికి పాల్పడుతున్న నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన నాగులూరి సిద్ధు అనే నిందితుడిని మంగళవారం ఎస్ఐ కమలాకర్ అరెస్టు చేసి దర్శి కోర్టులో హాజరు పరిచారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మండలంలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన నలుగురు నిందితులను అరెస్టు చేయగా అప్పటినుంచి సిద్ధు పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడని ఎస్ఐ కమలాకర్ చెప్పారు. అందిన సమాచారంతో నిందితుడ్ని చాకచక్యంతో పట్టుకున్నామన్నారు.



ఎన్టీఆర్ డూప్‌తో స్థానిక టీడీపీ నాయకులు

మహానాడుకు తరలిన టీడీపీ నాయకులు

గిద్దలూరు టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న 43వ మహానాడుకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు తరలి వెళ్లారు. రూరల్ బ్యాంక్ ఛైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, మున్సిపల్ కౌన్సిలర్ బి.చంద్రశేఖర్‌యాదవ్, 5వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి సంపత్‌కుమార్‌రెడ్డి, ఉయ్యాలవాడ, కొమ్మునూరు సర్పంచ్‌లు బి.గోపాలక్రిష్ణయాదవ్, రామసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు చేరెడ్డి జయరామిరెడ్డి, కె.మహానందియాదవ్, గుర్రం దానియేలు, తదితరులు మహానాడుకు తరలి వెళ్లారు.

రేషన్ దుకాణాల వద్దే సరుకుల పంపిణీ

డీలర్లకు తహసీల్దార్ ఆంజనేయరెడ్డి సూచన



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయరెడ్డి

గిద్దలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూన్ 1వ తేది నుంచి రేషన్ సరుకులు రేషన్‌షాపుల వద్దనే పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి డీలర్లకు సూచించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వాలని పేర్కొన్నారు. తూకాలు తక్కువ ఇచ్చినా, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ రామనారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రావు, గ్రామ రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం



మాట్లాడుతున్న గ్రంథపాలకుడు శివారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనం ద్వారా ఎంతో విజ్ఞానం పెరుగుతుందని గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి అన్నారు. వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. శివారెడ్డి మాట్లాడుతూ.. చదవడం ద్వారా ఎన్నో విజ్ఞాన విషయాలు, ప్రపంచ జ్ఞానం పెంచుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య అవసరం అన్నారు. మహిళా పోలీస్ శిరీష వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

నిత్య యోగాతో ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న మండల పరిషత్ సిబ్బంది



ఆసనాలు వేస్తున్న మార్కాపురం మున్సిపల్ కమిషనర్

గిద్దలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం కావాలనే ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని ఎంపీడీవో రమణారెడ్డి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో కలిసి యోగా సాధన చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో రమణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ తీసుకున్న వారందరూ ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.సతీష్‌బాబు, యోగా శిక్షకురాలు దుర్గమ్మ, డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : యోగా శారీరక, మానసిక ఆరోగ్యం రెండింటికీ ఎంతో ప్రయోజనకరమైనదని ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో వీరభద్రాచారి ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన చేయడం వలన ఒత్తిడి తగ్గి మానసిక స్పష్టత పెరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలలో యోగా పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా గ్రామ, మండల స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాలో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ముందుగా యోగా భంగిమలతో యోగాసనాలు చేయించారు.

జీవన విధానంలో భాగం చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్ : నిత్యజీవన విధానంలో యోగాసనాలను భాగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్సీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఒత్తిడిని తగ్గించుకొని ఏకాగ్రతను పెంచుకోవడానికి యోగాసనం దివ్యమార్గం అన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. యోగా పట్ల అవగాహన, ఆశక్తి పెంచేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ, మెప్మా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకం : యోగాతో మానసిక, శారీరక ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని త్రిపురాంతకం ఎంపీడీవో రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో యోగా శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. యోగాతో శ్వాస సంబంధ వ్యాధులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామసుబ్బయ్య, పీఈటీ రామ్మోహన్‌రెడ్డి యోగా శిక్షణ ఇచ్చారు.

ఎర్రగొండపాలెం : స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులకు, సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ క్లాసులు ప్రారంభించారు. పంచాయతీ, సచివాలయం నుంచి 200 మంది ఉద్యోగులు యోగా శిక్షణ పాల్గొన్నారు.



కంభంలో యోగా చేస్తున్న ఉద్యోగులు



త్రిపురాంతకంలో యోగా శిక్షణలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు

దర్శికి ఆటిజం కేంద్రం మంజూరు

దర్శి, మే 27(ఆంధ్రజ్యోతి) : మానసిక ఎదుగుదల లోపం కారణంగా జన్మించిన చిన్నారుల్లో ఆటిజం సమస్య ఎక్కువగా ఉంటుందని జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త నాగేంద్రనాయక్ తెలిపారు. చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 127 ఆటిజం కేంద్రాలను మంజూరు చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా దర్శి మున్సిపాలిటీలో నూతనంగా ఆటిజం కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆటిజం సమస్యతో బాధపడుతున్న విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు తెచ్చి విజ్ఞానవంతులుగా తయారు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నూతన భవన నిర్మాణానికి రూ.27.75 లక్షల నిధులు మంజూరైనట్లు ఆయన చెప్పారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు స్థానిక మోడల్ స్కూల్లో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. ఎంఈవోలు కె రఘురామయ్య, రబాదేవి, రీసోర్స్ పర్సన్లు ఎం. శ్రీనివాసులు, జి. సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆక్రమణ చెరలో చెరువు అలుగులు

- కూలిన చప్టా
- చెత్తాచెదారంతో ప్రజలకు రోగాలు



అధ్వాన్నంగా ఉన్న అలుగు

మార్కాపురం వన్‌టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : అలనాటి పెద్దలు ముందుచూపుతో వ్యవహరించి అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టారు. ఆఖరికి ఆంగ్లేయులు కూడా మనకు అవసరమైన కొన్ని మంచి పనులు చేశారు. ఆ కోవలోదే మార్కాపురం చెరువు. ఈ చెరువుకు ఉన్న అలుగులు కూడా ఎంతో ప్రాముఖ్యమైనవి. మార్కాపురం చెరువుకు నీరు అధికమైతే బయటకి వెళ్లడానికి 8వ వార్డు రేడియో స్టేషన్ సమీపంలో ఒక అలుగు, రైల్వే స్టేషన్ రోడ్డులోని పారిశ్రామిక వాడ వద్ద మరో అలుగును ఏర్పాటు చేశారు. విశాలమైన ఈ అలుగుల ద్వారా చెరువు పూర్తి స్థాయిలో నిండినప్పుడు నీరు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మైదన ప్రాంతంలో ప్రవహించేది. కాలక్రమేణా భూబకాసురుల కళ్లు చెరువు అలుగు, కట్టలపై పడ్డాయి. దీంతో విశాలమైన చెరువు అలుగు కట్టలు మాయమై అలుగు చిన్న మురుగు కాలువలా నిలబడింది. రేడియో స్టేషన్ వద్దనున్న అలుగును పూర్తి స్థాయిలో ఆక్రమించారు. 1976 వచ్చిన తుఫాన్‌కు అలుగు పైనుంచి నీరు ప్రవహించి ఆ ప్రాంతం అంతా నీట మునిగింది. దీంతో అధికారులు అలుగు సమీపంలో ఒక చప్టా నిర్మించారు. కొండ రాళ్లు, గుండ్లకమ్మ ఇసుకతో కట్టిన ఆ చప్టా ఒకవైపు కూలిపోయి ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది వాహనాలు రైల్వే స్టేషన్, ఒంగోలు తదితర ప్రాంతాలకు ఈ చప్టా మీదుగానే వెళుతుంటాయి. దీనికి తోడు అలుగు పటిష్టం చేయడానికి రాళ్లగోడ నిర్మించి రివిట్‌మెంట్ వేశారు. కాలక్రమేణా ఆక్రమణదారులు వాటిపై నిర్మాణాలు వేసుకుని శాశ్వత భవనాలు నిర్మించుకున్నారు. తొలుత ఆ స్థలంలో 4 రాళ్లు పేర్చి కుప్పలు వేస్తారు. పశువులను కట్టివేసి పశువుల కొట్టంగా మారుస్తారు. అనంతరం రేకుల షెడ్లు వేసి ఇప్పుడు పక్కా భవనాలు వేశాశారు. రేడియో స్టేషన్ నుంచి చిన్నమసీద్ వరకు ఉన్న అలుగు కట్టలపై నిర్మాణాలు చేపట్టారు. మేము తక్కువేమీ కాదని, ఇటీవల ఆ ప్రాంతంలో మరోవైపు అలుగు కట్టను పూడ్చి ఆటో స్టాండ్, జీప్ స్టాండ్ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అలుగు కట్ట మరింత కుంచించుకు పోయింది. ఇరిగేషన్ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఆక్రమణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పారిశ్రామికవాడ సమీపంలోని అలుగు కూడా ఆక్రమణలతో నిండింది. దానిపై కూడా నివాసాలు ఏర్పరుచుకున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి అలుగులోని ఆక్రమణలు తొలగించి చెత్తా చెదారానికి మారుపేరుగా నిలిచిన మార్కాపురం చెరువు అలుగును శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అలుగు రివిట్‌మెంట్



అలుగు స్థలంలో ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్



అలుగు గడ్డపై నిర్మించిన ఇళ్లు

మహా జోష్

- దర్శి, కనిగిరి నియోజకవర్గాల నుంచి కడపకు భారీగా తరలివెళ్లిన తమ్ముళ్లు
- మహానాడులో పలువురు రక్తదానం.. ఆ శిబిరంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సేవలు
- పలువురికి ప్రశంసా పత్రాల అందజేత
- ముగింపు సభకూ భారీగా హాజరు



దొనకొండ నుంచి మహానాడుకు బయలుదేరిన నేతలు



రక్తదానం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

దర్శి, మే 27(ఆంధ్రజ్యోతి): దర్శి మండలం నుంచి కడప మహానాడుకు అధికసంఖ్యలో తరలివెళ్లారు. ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, పలువురు సోమవారం సాయంత్రం వెళ్లగా, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మరికొందరు నాయకులు మంగళవారం ఉదయం తరలి వెళ్లారు. కడప మహానాడులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వైద్య సేవలు అందించారు. అలాగే దర్శిలో ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు.

● ముండ్లమూరు నుంచి...

ముండ్లమూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడప మహానాడుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా తరలి వెళ్లారు. మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావులతో పాటు సోమేపల్లి శ్రీనివాసరావు, బద్రి గోపాలరెడ్డి, గూడాల సాంబశివారెడ్డి, బిజ్జం సుబ్బారెడ్డి, దిరిశాల శ్రీనివాసరావులు తమ వారితో వెళ్లారు. డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, నీటి సంఘాల అధ్యక్షులు ఉన్నం పరిపూర్ణయ్య, సర్పంచ్ కూరపాటి నారాయణ స్వామి, వరగాని పౌలు, కొక్కెర నాగరాజు, వేమూరి శ్రీనివాసరావు, జంపాని శ్రీనివాసరావు, చాగంటి రాంబాబు, తేలుకుట్ల బ్రహ్మం, ఏరేసు వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

● పామూరు నుంచి...

పామూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడప మహానాడుకు పామూరు నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరళి వెళ్లారు. వారిలో నేతలు కోటపాటి జనార్దనరావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, గుర్రం వెంకటేశ్వర్లు, చుంచు కొండయ్య, వై ప్రసాద్‌రెడ్డి, బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, బొల్లా మహాలక్ష్మమ్మ, ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్ నాగేంద్ర, పిడుగు శ్రీనివాసులు ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే ఉగ్రను కలిశారు.

● దొనకొండ నుంచి..

దొనకొండ, మే 27(ఆంధ్రజ్యోతి) : కడప మహానాడుకు మండలం నుంచి భారీగా వెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోడీ ఆంజనేయులు, నాగులపాటి శివకోటేశ్వరరావు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, పత్తి వెంకటేశ్వర్లు, పోతిపోగు చెన్నయ్య మరికొందరు నాయకులు మంగళవారం తరలివెళ్లారు. 29వ తేదీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆదేశాల మేరకు అధికసంఖ్యలో తరలివెళ్లేందుకు సంసిద్ధమవుతున్నట్లు వారు తెలిపారు.

● తాళ్లూరు నుంచి...

తాళ్లూరు, మే 27(ఆంధ్రజ్యోతి) : కడపలో మహానాడులో రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా వీరాంజనేయస్వామి అధ్యక్షునిగా, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ సభ్యులుగా ఉన్న రక్తదాన శిబిరంలో తాళ్లూరు తెలుగు తమ్ముళ్లు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీను, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి, ఐటీడీపీ యువనేత నవులూరి విద్యాసాగర్‌లు రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆ ముగ్గురికి మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్, పిన్నిక రమేష్, రాచకొండ వెంకట్రావు పాల్గొన్నారు. అన్ని గ్రామాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు మహానాడుకు తరలి వెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, షేక్ కాలేషావలి, కైపు నాగార్జునరెడ్డి, పిన్నిక రమేష్, పాశం నూరిబాబు, కైపు రామకోటిరెడ్డి, బొద్దు హనుమారెడ్డి వెళ్లారు.



మహానాడు వేడుకల్లో తాళ్లూరు తెలుగు తమ్ముళ్లు



పామూరు నేతలు



ముండ్లమూరు నేతలు

మహిళ ఆత్మహత్య

దర్శి, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పువీరాయపాలెంలో మంగళవారం మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ మురళి కథనం ప్రకారం.. సీహెచ్ వెంకటరత్నం(30) భర్త మందలించడంతో మనస్తాపం చెంది, ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వెంకటరత్నం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గంజాయి విక్రేత అరెస్టు

ముండ్లమూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గంజాయి విక్రయానికి పాల్పడుతున్న నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన నాగులూరి సిద్ధు అనే నిందితుడిని మంగళవారం ఎస్ఐ కమలాకర్ అరెస్టు చేసి దర్శి కోర్టులో హాజరు పరిచారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మండలంలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన నలుగురు నిందితులను అరెస్టు చేయగా అప్పటినుంచి సిద్ధు పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడని ఎస్ఐ కమలాకర్ చెప్పారు. అందిన సమాచారంతో నిందితుడ్ని చాకచక్యంతో పట్టుకున్నామన్నారు.

దివ్యాంగుల సర్వే పరిశీలన



దివ్యాంగుల సర్వేను పరిశీలిస్తున్న ఎంఈవోలు

పీసీపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి) : మండలంలో జరుగుతున్న దివ్యాంగుల సర్వేను ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి ఆర్పీలకు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లోని దివ్యాంగులను గుర్తించి సర్వేలో నమోదు చేయాలని సూచించారు. ఇంకా గ్రామాల్లో ఎవరైనా మాటలు, వినికిడి, మందబుద్ధి కలిగిన చిన్నారులు ఉంటే ఐఆర్‌టీతో సంప్రదించాలన్నారు. దివ్యాంగులకు అందించాల్సిన సామగ్రిని సమగ్ర శిక్ష ద్వారా అందిచనున్నట్లు చెప్పారు. దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఐఆర్‌టీ టీచర్లు నాగేశ్వరరావు, శ్వేషిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

మార్కాపురం రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పాయపాలెం సమీపంలో హైవేపై కారు బైక్ ఢీకొని టీడీపీ కార్యకర్త పోతిరెడ్డి వెంకటేశ్వర్లు (30) మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పోతిరెడ్డి వెంకటేశ్వర్లు బైక్‌పై కంభంకు వ్యక్తిగత పనుల నిమిత్తం వెళుతున్నారు. అదే సమయంలో కంభం వైపు నుంచి కుంట వైపునకు కారు వస్తుంది. మండలంలోని తిప్పాయపాలెం సమీపంలో హైవేపై కారు బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు పంచాయతీ శివాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు టీడీపీ కార్యకర్తగా ఉన్నారు. మహానాడు ముగింపు సభకు వెళ్లే పనుల్లో ఉండగా మృతి చెందారని టీడీపీ నాయకులు తెలిపారు. అతనికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ ఎస్ఐ అంకమ్మరావు, ఏఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

మతోన్మాదుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

పామూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : మతం పేరులో మారణహోమాలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందాలనుకొంటున్న మతోన్మాదుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ చెప్పారు. స్థానిక జీవైఆర్ భవన్‌లో సీపీఐ మండల 6 మహాసభ వజ్రాల సుబ్బారావు, ఇర్రి వెంకటరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య శత జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా జరుపుకొంటున్న ఏకైక పార్టీ సీపీఐ అని చెప్పారు. కమ్యూనిస్టులు బలోపేతం కావలసిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశామని చెప్పిన మోడి ట్రంప్ మధ్యవర్తిత్వంతో యుద్ధం ఆగిపోవడానికి కారాణాలు ఏమిటో ఇంత వరకు దేశ ప్రజలకు తెలియజేయకపోవడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. నక్సలైట్లను అణచివేత పేరులో గిరిజన ప్రాంతాల్లోని ఖనిజ సంపదను పారిశ్రామిక వేత్తలను దోచిపెట్టడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతోందని విమర్శించారు. జూన్‌లో దర్శిలో జరగనున్న జిల్లా మహాసభలను, ఆగస్టులో ఒంగోలులో రాష్ట్రసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసిన్, మౌలాలి, మండల కార్యదర్శులు పోతుల ప్రభాకర్, చిన మస్తాన్, వజ్రాల సుబ్బారావు పాల్గొన్నారు.

స్టోరేజీలకు మొదలైన సాగర్ జలాల పంపింగ్

దొనకొండ, మే 27(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం సాగర్ కెనాల్‌కు విడుదల చేసిన సాగర్ జలాలు మండలంలోని చందవరం సమీపంకు మంగళవారం చేరుకున్నాయి. చందవరం గ్రామ సమీపంలోని సాగర్ కెనాల్ వద్ద నిర్మించిన చందవరం-1, -2 సాగర్ జలాల స్టోరేజీలకు కెనాల్ నుంచి విద్యుత్ మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తున్నారు. మండలంలోని 29 గ్రామాలకు నీటి సరఫరా చేసే చందవరం-1 స్టోరేజీలో 68 శాతం నీళ్లు ఉన్నాయని నూరుశాతం నింపేందుకు చర్యలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్ చెప్పారు. కొనకనమిట్ల, హెచ్‌ఎంపాడు, పొదిలి మండలాల్లోని 127 గ్రామాలకు సరఫరా జరిగే చందవరం-2 స్టోరేజీలో 50శాతం నీళ్లు ఉన్నాయని కెనాల్‌లో నీటి సరఫరా జరిగే వారం రోజుల్లో నూరుశాతం స్టోరేజీ నింపుతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు.



చందవరం-2 స్టోరేజీకి సాగర్ జలాలు నింపుతున్న దృశ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పీసీపల్లిలో యోగా చేస్తున్న అభ్యాసకులు

పామూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం ద్వారా మానసిక రుగ్మతలు తగ్గి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ గద్దె ఏడుకొండలు సూచించారు. స్థానిక గ్రామ సచివాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం యోగా ఆసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుండరీ కాంక్షయ్య, ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఇన్‌చార్జి డిప్యూటి ఎంపీడీవో జీవీ అరవిందారెడ్డి, ఈవోఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, పంచాయతీ గుమస్తా జీవీ రత్నకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా రిజిస్ట్రేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

● తాళ్లూరులో...

తాళ్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతకాలంలో ప్రతి వ్యక్తి జీవితం ఉరుకుల, పరుగులతో సాగుతోందని, ఆ ఒత్తిడిని తట్టుకొని ఆరోగ్యాన్ని కాపాడు కోవడానికి ప్రతి ఒక్కరూ యోగాభ్యాసంపై దృష్టి సారించాలని ఎంపీడీవో దారా హనుమంతరావు, మన్నేపల్లి హోమియో వైద్యురాలు శిరీషలు చెప్పారు. యోగాంధ్రప్రదేశ్‌లో భాగంగా మంగళవారం నుండి ఎంపీడీవో కార్యాలయం వద్ద యోగాపై 5 రోజుల పాటు సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి.

● యోగాతో మంచి ఆరోగ్యం

పీసీపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతోనే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీడీవో ప్రభాకరశర్మ చెప్పారు. యోగా డేను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం యోగాపై 200 మందికి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం వలన శరీర ఆరోగ్యానికి మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేటి ఒత్తిడి జీవన విధానంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని చెప్పారు. శిక్షణ పొందిన వారంతా జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ప్రజలతో యోగా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనర్ పి.ప్రసాద్, ఏపీవో జహంగీర్ బాషా, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్ పాల్గొన్నారు.

తిరునాళ్లను వివాదాలు లేకుండా జరుపుకోవాలి

సీఎస్‌పురం/పామూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురంలో ఈ నెల 30 నుంచుట జూన్ నుల 5వ తేదీ వరకు ప్రారంభం కానున్న శ్రీ రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల ఉత్సవాలను ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ భీమానాయక్ చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామంలోని వివిధ సామాజిక వర్గాల నాయకులతో ఎస్ఐ సుమన్ అధ్యక్షతన మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతు అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, రెచ్చకొట్టే ప్రసంగాలకు వివాదాలకు తావు ఇవ్వకుండా ప్రశాంతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ప్రత్యేక పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులు ఆదర్శ ప్రాయుడు



వీరేశలింగం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీవో

తాళ్లూరు, మే 27(ఆంధ్రజ్యోతి) : సంఘసంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు మహిళల అభ్యున్నతికి పోరాడారని, కందుకూరిని అందరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎంపీడీవో దారా హనుమంతరావు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాలులో మంగళవారం కందుకూరి వీరేశలింగంపంతులు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వహకకార్యదర్శి శాగం కొండారెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు ఎస్.సత్యం, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరావు, టీడీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు అనపర్తి సుబ్బారావు, కొర్నెపాటి లక్ష్మయ్య, స్వామిదాస్, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలకు అడ్డుకట్ట

అవీఇవీ



మాట్లాడుతున్న సీఐ రామారావు

ముండ్లమూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం వల్ల నేరాల అడ్డుకట్ట వేయవచ్చని సీఐ వై రామారావు చెప్పారు. ఆయన మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పలు కేసుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏ చిన్న సంఘటన కూడా జరగకుండా ఉండాలంటే ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చాలా ముఖ్యమన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించటంతో పాటు ఏదైనా నేరానికి పాల్పడే వ్యక్తులను గుర్తించవచ్చని చెప్పారు. ముఖ్యమైన కూడళ్లల్లో, దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద వాటిని ఏర్పాటు చేయాలని ఎస్ఐ కమలాకర్‌ను ఆదేశించారు. ఏఎస్ఐ పీవీ హనుమంతరావు, ఎన్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దర్శికి ఆటిజం కేంద్రం మంజూరు



చిన్నారులతో మాట్లాడుతున్న సమన్వయకర్త నాగేంద్రనాయక్

దర్శి, మే 27(ఆంధ్రజ్యోతి) : మానసిక ఎదుగుదల లోపం కారణంగా జన్మించిన చిన్నారుల్లో ఆటిజం సమస్య ఎక్కువగా ఉంటుందని జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త నాగేంద్రనాయక్ తెలిపారు. చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 127 ఆటిజం కేంద్రాలను మంజూరు చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా దర్శి మున్సిపాలిటీలో నూతనంగా ఆటిజం కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆటిజం సమస్యతో బాధపడుతున్న విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు తెచ్చి విజ్ఞానవంతులుగా తయారు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నూతన భవన నిర్మాణానికి రూ.27.75 లక్షల నిధులు మంజూరైనట్లు ఆయన చెప్పారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు స్థానిక మోడల్ స్కూల్లో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. ఎంఈవోలు కె రఘురామయ్య, రబాదేవి, రీసోర్స్‌పర్సన్లు ఎం. శ్రీనివాసులు, జి. సుబ్రమణ్యం పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

పామూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుక్కాపురంలో ఉన్న తమ వ్యవసాయ భూమిని గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకొని ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించుకొన్నాడని పామూరుకు చెందిన షేక్ మస్తాన్, తహసీల్దార్ బీవీ రమణారావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తన తండ్రి షేక్ శిలార్‌సాహెబ్ భారత సైన్యంలో పనిచేసినందుకు ప్రభుత్వం బుక్కాపురంలో సర్వేనెంబర్ 81/2లో 3.17ఎకరాలు భూమిని కేటాయించి పట్టాలు మంజూరు చేసింది. ఇటీవల భూమిని పరిశీలించగా గ్రామానికి చెందిన ఓబయ్య కుమారుడు ఓబులరాజు అతని కుటుంబ సభ్యులు తమను అడ్డుకొన్నారని తెలిపారు. నోటీసులు ఇచ్చి సర్వే చేసి పూర్తి వివరాలు ఇవ్వాలని వీఆర్వో కేసీ వెంకటస్వామిని తహసీల్దార్ ఆదేశించారు.

మానవత్వం చాటుకున్నపంచాయతీ కార్యదర్శి


అంధురాలికి సహాయం అందజేత



అంధురాలిని సత్కరిస్తున్న కార్యదర్శి రమణారెడ్డి

తాళ్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇడమకంటి వెంకటరమణారెడ్డి మానవత్వం చాటుకున్నారు. తూర్పుపాలెంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి గ్రామ సందర్శన చేస్తుండగా ఓ అంధవృద్ధురాలు షేక్ నాసరమ్మ ఎవరి సాయం లేకుండా ఒంటరిగా దూరంగా ఉన్న కుళాయి వద్ద నీరు తెచ్చుకొంటుండగా గమనించారు. ఆమె పడుతున్న కష్టాన్ని గమనించి ఆమెస్థితిగతులను తెలుసుకున్నారు. నాసరమ్మ పుట్టు అంధురాలని, ప్రస్తుతం ఒంటరిగా జీవిస్తోందని, జీవనం కష్టంగా ఉందని, ఇంటి వసతులు సరిగా లేవని గమనించారు. స్పందించిన కార్యదర్శి వెంటనే ఆ వృద్ధురాలి ఇంటి ముందు ప్రత్యేక నీటికుళాయి ఏర్పాటు చేయించాడు. ఇంటి ముందు కరెంట్ లేక అంధకారంలో ఉండగా విద్యుత్తు బల్బు వేయించారు. ఆమె భోజన వసతి కోసం బియ్యం, ఇతర వంట సామగ్రిని అందించారు. అంధురాలైనా ధైర్యంగా జీవించటం ఆదర్శమని ఆమెను దుశ్శాలువాతో సత్కరించారు. ఏ కష్టమొచ్చినా తన దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు.


1 నుంచి రేషన్ షాపు వద్దే సరుకుల పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ


ముండ్లమూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : జూన్ నెల 1వ తేదీ నుంచి నిత్యావసర సరుకులు రేషన్ షాపు వద్దే కార్డుదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, 60ఏళ్లకు పైబడిన వారికి మాత్రమే ఇంటి వద్దకు వెళ్లి సరుకులు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ పీ శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ ప్రసాదు పాల్గొన్నారు.

నీటి నిల్వ సామర్థ్యం పనులు చేపట్టాలి



బోడవాడలో నిర్మిస్తున్న ఫారం పాండ్స్‌ను పరిశీలిస్తున్న ఏపీవో మాల్యాద్రి

పామూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బోడవాడ, అయ్యవారిపల్లి, బొట్లగూడూరు, గ్రామాల్లో జరుగుతున్న ఫారంపాండ్స్ పనులను ఏపీవో మాల్యాద్రి మంగళవారం పరిశీలించారు. మండలంలో ఇప్పటికి 70 వరకు ఫారంపాండ్స్ పనులు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. అలాగే సీఎస్‌పురం మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు గాను 345 టార్గెట్ కాగా 80 పనులు జరుగుతున్నాయని ఏపీవో తెలిపారు.



ఉష్ణోగ్రత (అంచనా) 28-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	33	27
తెనాలి	32	27
నరసరావుపేట	33	27
బాపట్ల	33	28
రెంటచింతల	34	28
చీరాల	33	28

హలధారికి.. జలసిరి

- పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు
- మరో వారంలో విడుదల కానున్న మార్గదర్శకాలు
- కుసుమ్ పథకానికి అనుసంధానం చేసే దిశగా చర్యలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.4 కోట్లు కేటాయించే అవకాశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు సాగునీటి కష్టాలు తీర్చే జలసిరి పథకాన్ని మళ్లీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జలసిరి పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పేరు మార్చి ఓ ప్రహసనంగా మార్చి రైతులను ఇబ్బందులకు గురి చేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా జలసిరి పథకాన్ని పునరుద్ధరించింది. రైతుల అభీష్టానికి అనుగుణంగా ఎన్టీఆర్ జలసిరి పేరిట పథకాన్ని తిరిగి అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కూడా జరిగింది. పథకం అమలులో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఉచిత బోర్ల అవసరాలపై ప్రభుత్వం ఇప్పటికే అధికారుల నుంచి నివేదిక తీసుకుంది. నిధుల కేటాయింపులో భాగంగా వంహాడం జిల్లాల పరిధిలో తొలి విడతలో రూ.4కోట్లు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వారంరోజుల్లో ఎన్టీఆర్ జలసిరి పథకం అమలుకు సంబంధించి పూర్తి స్పష్టత రానుందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకాన్ని కేంద్ర ప్రాయోజిత పథకం కుసుమ్‌తో అనుసంధానం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. దీనిలో భాగంగా జలసిరి పథకానికి సోలార్ పంపుసెట్లకు అధిక ప్రాధాన్యమిచ్చేలా చూడాలనే ఆదేశాలు ఇప్పటికే ప్రభుత్వానికి వచ్చాయి. సోలార్ సౌకర్యం లేని చోట విద్యుత్ ఆధారితానికి వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాల వారీగా తవ్వే ఉచిత బోర్లలో దాదాపు 40 శాతం సోలార్ ఆధారంగానే పనిచేసేలా చూడాలనే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేయనుంది.ఒక్కో యూనిట్‌కు కేంద్ర ప్రభుత్వం వాటా 40 శాతం కాగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ రూపంలో 30 శాతం భరించనుండగా మిగిలినది రైతు భరించేలా మార్గదర్శకాలు విడుదల కానున్నట్లు తెలుస్తోంది.

గతంలో 12,000 చేతిపంపులు

సాగునీరు సకాలంలో అందక పైర్లు ఎండిపోతున్న అంశాలను దృష్టిలో పెట్టుకుని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టింది. వాల్టా చట్టం నిబంధనలను పాటిస్తూనే పొలాల్లో ఉచితంగా బోర్లు తవ్వించి విద్యుత్ కనెక్షన్ కూడా ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని అప్పట్లో ముమ్మరంగా చేపట్టింది. ఆ ఐదేళ్ల వ్యవధిలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.7 కోట్లు నిధులు ఖర్చుచేసి 12,000 మంది రైతుల ప్రయోజనాలను కాపాడింది. దీంతో సాగునీటి విషయంలో వరుణదేవుడి మీదనే ఆధారపడిన అవసరం లేకుండా రైతులు సాగు చేసుకునేవారు.



వైసీపీ నిర్లక్ష్యం

ఈ పథకం పేరును 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వైఎస్సార్ జలకళగా మార్చింది. అయితే ఐదేళ్లలో కనీస స్థాయిలో కూడా ఆ పథకం అమలు చేయలేదు. నియోజకవర్గాల వారీగా రిగ్గులను కేటాయించడంతో సరిపెట్టింది తప్పితే నిర్దేశించుకున్న లక్ష్యాలపై దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. బాపట్ల జిల్లాలో 5,600 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 770 బోర్లు, గుంటూరు జిల్లాలో 560 దరఖాస్తులకు 135, పల్నాడు జిల్లాలో 10,600 దరఖాస్తులకు 1,100 బోర్ల తవ్వకంతో సరిపెట్టింది. అరకొరగా తవ్విన బోర్లకు కూడా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం చేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇందులో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ జరిపి నిజానిజాల నిగ్గు తేల్చడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.



రేషన్.. 1 నుంచి షాపుల్లోనే

- దుకాణాల వద్దే సరుకుల పంపిణీకి ఏర్పాట్లు
- ఇక ఎండీయూల కోసం పడిగాపులు అవసరం లేదు
- పంపిణీని ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- వృద్ధులు, అనారోగ్య పీడితులకు ఇళ్ల వద్ద పంపిణీకి ఆదేశాలు
- రేషన్ వాహనాల వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇక రేషన్ సరుకుల కోసం పడిగాపులు పడాల్సిన అవసరం లేదు. ఎప్పుడు రేషన్ వాహనం వస్తుందో తెలియక.. పనులకు వెళ్లలేక.. వెళ్తే ఆ నెలకు సరుకులు అందవేమోనని ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. ఎండలో.. వీధుల్లో.. రేషన్ సరుకులు తీసుకునేందుకు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన దుస్థితి పోయినట్లే. కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీలో కూటమి ప్రభుత్వం మార్పులు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో ఇక నెల మొదటి 15 రోజుల్లో ఎప్పుడు తీరిక ఉంటే అప్పుడు వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చు. సెలవు పెట్టి ఇళ్ల వద్ద ఉండాల్సిన అవసరం లేకుండా పనులు, విధులు ముగించుకుని, వీలున్నప్పుడు వెళ్లి.. లేదంటే సెలవు రోజుల్లోనే గతంలో మాదిరిగా దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకునే అవకాశం మళ్లీ వచ్చేసింది. ఈ క్రమంలో 1వ తేదీ ఆదివారం నుంచి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని రేషన్ దుకాణాల వద్దే సరుకులు పంపిణీకి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. 1వ తేదీ ఆదివారం రోజు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రేషన్ షాపుల వద్ద సరుకుల పంపిణీ ప్రారంభించనున్నారు.

జరగని హేతుబద్ధీకరణ కష్టాలు

ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా రేషన్ దుకాణాల హేతుబద్ధీకరణ జరగలేదు. వాస్తవానికి ఒక్కో దుకాణం పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండాలి. షాపులకు కార్డుల కేటాయింపు అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కువ కార్డులున్న షాపుల్లోని కార్డులను తక్కువ ఉన్న వాటికి కేటాయించే ప్రక్రియ జరగలేదు. దీంతో కొన్ని షాపుల్లో 200 లోపు కార్డులు ఉంటే మరికొన్ని షాపుల్లో 1000 నుంచి 1500 వరకు కార్డులు ఉన్నాయి. దీంతో సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రేషన్ షాపులకు కార్డుల హేతుబద్ధీకరణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని షాపుల్లో కార్డులు అత్యధికంగా ఉండటంతో కార్డుదారులు సరుకులు తీసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రానున్నాయి. కార్డుదారులు వీధిల్లోనే ఎండీయూల ద్వారా సరుకులు పంపిణీ చేయడంతో డీలర్ వద్ద కార్డులు ఎక్కువ, తక్కువ ఉన్నా ఇబ్బందులు తలెత్తలేదు. ఉదాహరణకు నరసరావుపేటలోని 368 నెంబరు షాపునకు 131 కార్డులు కేటాయిస్తే 427 నెంబరు షాపునకు 1148 కార్డులు కేటాయించారు. చిలకలూరిపేట పట్టణంలో 655 నెంబరు షాపులో 56 కార్డులు ఉంటే 696 నెంబరు షాపులో 1382 కార్డులు ఉన్నాయి. ఇదే పరిస్థితి గుంటూరు, బాపట్ల జిల్లాలతో పాటు పల్నాడు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ ఉంది. ఈ పరిస్థితుల్లో సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తనున్నాయన్న అభిప్రాయాన్ని కార్డుదారులు వ్యక్తం చేస్తున్నారు.

సరుకుల పంపిణీ ఇలా..

ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాలను తెరిచి ఉంచాలని డీలర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయా రోజుల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు దుకాణాల వద్దే సరుకులు పంపిణీ చేయాలి. దుకాణం పరిధిలోని దివ్యాంగులు, అనారోగ్యం వల్ల మంచంపై ఉన్నవారు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు సరుకులను వారి ఇంటి వద్దే డీలర్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

షాపులు.. కార్డులు

- గుంటూరు జిల్లాలో 972 రేషన్ షాపుల పరిధిలో 5,89,531 కార్డులు ఉన్నాయి. ఎన్ఎఫ్ఎస్ఏ పథకం కింద ఏఏవై కార్డులు 22,862, పీహెచ్‌హెచ్ కార్డులు 49,869, రాష్ట్ర ప్రభుత్వ పథకం కింద 512 ఏఏవై, పీహెచ్‌హెచ్ 4,05,072 కార్డులు ఉన్నాయి.
- పల్నాడు జిల్లాలో 6,34,893 కార్డులు ఉండగా వీటిలో జాతీయ ఆహార భద్రత పథకం(ఎన్ఎఫ్ఎస్ఏ) కింద అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డులు 28,898, ప్రాధాన్య గృహ (పీహెచ్‌హెచ్) కార్డులు 1,70,974 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఏఏవై కార్డులు 646, పీహెచ్‌హెచ్ కార్డులు 4,34,375 కార్డులు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో 1123 రేషన్ షాపులు పరిధిలో 4,76,529 కార్డులు ఉన్నాయి. ఏఏవై కార్డులు 20,784, పీహెచ్‌హెచ్ కార్డులు 45,876 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పథకం కింద ఏఏవై కార్డులు 453 ఉన్నాయి.

సజ్జాపురంలో డ్వాక్రా సొమ్ము స్వాహా

- విచారణలో నిర్ధారించిన వెలుగు అధికారులు
- యానిమేటర్ బ్యాంకుకు చెల్లించలేదని నిర్ధారణ

సంతమాగులూరు(అద్దంకి), మే 27 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ఇచ్చిన నగదును బ్యాంక్‌లో చెల్లించకుండా యానిమేటర్ సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు వెలుగు అధికారులు నిర్ధారించారు. రుణాలకు సంబంధించి నెలవాయిదాలు చెల్లించక పోవడంతో ఇటీవల బ్యాంకు అధికారులు సంతమాగులూరు మండలం సజ్జాపురంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. రుణాలకు సంబంధించి నెలవారీ చెల్లించే మొత్తాన్ని తాము చెల్లించినా ఖాతాల్లో జమ చేయలేదని మహిళలు తేల్చారు. సుమారు రూ.10 లక్షలు బ్యాంకులో చెల్లించలేదని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే ఈ మొత్తం మరికొంత మేర పెరిగే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. సదరు యానిమేటర్‌ను మహిళలు, వెలుగు అధికారులు నిలదీయగా కొంత సమయం ఇస్తే నగదు చెల్లిస్తానని చెప్పినట్లు తెలిసింది. గడువు ముగిసినా చెల్లింపులు చేయకపోవడంతో స్వయంసహాయక సంఘాల సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రూ.10 లక్షల వరకు సదరు యానిమేటర్ చెల్లించేందుకు అంగీకరించిందని, అయితే చెల్లింపునకు కొంత సమయం కోరినట్లు సంతమాగులూరు ఏపీఎం హనుమంతరావు తెలిపారు.

యోగాతో.. ఆరోగ్యం, ఉల్లాసం

- దైనందిన జీవితంలో ఓ భాగం చేసుకోవాలి
- యోగాంధ్ర క్యాంపెయిన్‌లో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం శ్రీభావన్నారాయణస్వామి దేవాలయం ఎదురు రథంబజారులో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత పతంజలి గురువు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులు, ఉద్యోగులతో కలిసి ఆసనాలు వేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మనిషి దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలన్నారు. మనదేశానికే పరిమితమైన యోగాని 2014లో ప్రధాని మోదీ ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. 2015లో లక్షా53 వేల మందితో గుజరాత్‌లో అతిపెద్ద మాస్‌యోగా నిర్వహించారన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న విశాఖలో నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని మోదీని ఒప్పించారన్నారు. జిల్లాలో యోగాంధ్ర 2025 క్యాంపెయిన్‌లో కార్యక్రమాలను నెలరోజులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో భట్టిప్రోలు, సూర్యలంక బీచ్, రామాపురం బీచ్ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మాస్టర్ ట్రైనర్లకు కలెక్టరేట్‌లో శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి లవన్న, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ వెంకటమురళి తదితరులు

30 వరకే తాగునీటి విడుదల

- మరో రెండు రోజుల్లో సాగర్ గేట్లు బంద్
- 10 టీఎంసీలకు 4 టీఎంసీలకే ఆమోదం
- మరో 4 టీఎంసీల కోసం జలవనరులశాఖ వినతి
- ఇంతవరకు స్పందించని కేఆర్ఎంబీ వర్గాలు


బుగ్గవాగు నుంచి కుడికాలువకు నీటి సరఫరా

నరసరావుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నుంచి తాగు నీటి అవసరాల కోసం కుడి కాల్వకు నీటి సరఫరా 30వ తేదీ వరకు మాత్రమే జరగనున్నది. ఆ తర్వాత డ్యాం నుంచి నీరు ఆగిపోనున్నది. ఈ నెల 22 నుంచి రోజూ 5,598 క్యూసెక్కులను డ్యాం నుంచి విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. 30వ తేదీ అర్ధరాత్రి వరకు నీటి విడుదల జరగనున్నది. ఆ తర్వాత జలాశయం గేట్లు బంద్ చేసి నీటి విడుదలను ఆపేయనున్నారు. కుడి కాల్వ పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీలు కేటాయించాలని జలవనరుల శాఖ కేఆర్ఎంబీని కోరింది. అయితే కేఆర్ఎంబీ 4 టీఎంసీల నీటిని మాత్రమే కేటాయించిన విషయం తెలిసిందే. కనీసం మరో 4 టీఎంసీలు కేటాయించాలని ఉన్నతాధికారులు కేఆర్ఎంబీని కోరారు. అదనపు కేటాయింపులపై మంగళవారం రాత్రి వరకు కేఆర్ఎంబీ వర్గాల నుంచి స్పందన రాలేదు. ఈ పరిస్థితుల్లో కుడి కాల్వ పరిధిలోని చెరువులను నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ శాఖల అధికారులను ఎస్‌ఈ కృష్ణమోహన్ కోరారు. డ్యాం నుంచి 30న నీటి సరఫరా నిలిపివేసినా బుగ్గవాగు నుంచి మరో రెండు రోజులు సరఫరా జరిగే అవకాశం ఉంది. మేజర్ కాల్వ నుంచి మైనర్లు, సబ్ మైనర్లకు నీటి సరఫరా చేసే తూములకు షట్టర్లు లేకపోవడంతో తాగు నీరు వృథా అవుతోంది. వచ్చే సీజన్‌కు అయినా షట్టర్లు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టేందుకు జలవనరుల శాఖ చర్యలు చేపట్టాలి.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో.. ఏఎన్‌యూకు ర్యాంకులు

పెదకాకాని, మే 27(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ది వీక్ - హన్సా రీసెర్చ్ బెస్ట్ యూనివర్సిటీ సర్వే - 2025 ర్యాంకింగ్స్ విడుదల చేసింది. మల్టీ డిసిప్లినరీ వర్సిటీ కేటగిరిలో జాతీయస్థాయిలో ఏఎన్‌యూ 13, సౌత్ జోన్ స్థాయిలో 6, రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకులను కైవసం చేసుకుంది. మౌలిక వసతులు, మేధావులపై అధ్యాపకులు, పరిశోధన, అకడమిక్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ అడ్మిషన్స్, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్, ప్లేస్మెంట్స్ ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించడం జరిగింది. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కృషి వల్లే ఈ ర్యాంకులు వర్సిటీకి సాధ్యమైనట్లు తాత్కాలిక వీసీ ఆచార్య కె.గంగాధరరావు మంగళవారం తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్, యూకే ఆధ్వర్యంలో ప్రకటించిన ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ - 2025లో ఏఎన్‌యూ అంతర్జాతీయంగా బ్యాండ్ 600 + ర్యాంక్‌ని సొంతం చేసుకుంది. అభ్యాసన వాతావరణం, పరిశోధన వాతావరణం, నాణ్యత, శ్రేష్ఠత, అంతర్జాతీయ దృక్పథం, పరిశ్రమలను పరిశీలించి ర్యాంక్ లను విడుదల చేసింది. రిజిస్ట్రార్ జి.సింహాచలం, డాక్టర్ రవి, ఆర్కిటెక్చర్ కళాశాల బోధనా సిబ్బంది ఉన్నారు.


ర్యాంకులు చూపుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

హడావుడిగా.. పునర్విభజన

- హెల్త్ అసిస్టెంట్ల రీడిప్లాయ్మెంట్‌లో వసూళ్లు
- మెయిల్‌లో రాత్రి ఆదేశాలు.. ఉదయం కౌన్సెలింగ్
- 22 ఏళ్లుగా ఒకే చోట ఉన్న వారిని తిరిగి కొనసాగింపు


గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం

గుంటూరు సిటీ, మే 27(ఆంధ్ర జ్యోతి): అవినీతి.. అక్రమాలు.. మామూళ్లు ఇచ్చిన వారిని బదిలీ చేయకుండా కొనసాగింపు.. ఇదీ హెల్త్ అసిస్టెంట్ల(మేల్) పునర్విభజన(రీడిప్లాయ్మెంట్) ప్రక్రియ సాగిన తీరు. రీడిప్లాయ్మెంట్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు గుంటూరు వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి సోమవారం రాత్రి 9.30 గంటలకు ఆరోగ్య కేంద్రాలకు మెయిల్ పంపారు. కనీసం ఒక్క రోజు కూడా గడువు ఇవ్వకుండా హెల్త్ అసిస్టెంట్లను గుంటూరుకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఆరోగ్య శాఖ మంత్రి చెప్పిన మాటలకు ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు సమాధి కట్టారు. ముడుపులు ముట్టిన నేపథ్యంలోనే ఈ రీడిప్లాయ్మెంట్ ప్రక్రియలో సుమారు 70 మంది హెల్త్ అసిస్టెంట్ల పేర్లు లేకుండానే జాబితాను వెలువరించడం వివాదాస్పదమవు తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న సుమారు 177 మంది హెల్త్ అసిస్టెంట్లను మలేరియా సంబంధిత పనుల్లో నియమించాలని నెల క్రితం రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే అప్పటి నుంచి మౌనంగా ఉన్న జిల్లా అధికారులు సోమవారం రాత్రి నుంచి హడావిడి చేశారు.

వారి పేర్లు లేవు...

రెండేళ్ల క్రితం 143 జీవో పరిధిలోని హెల్త్ అసిస్టెంట్ల (మేల్) రీడిప్లాయ్మెంట్ ప్రక్రియ జరిగింది. అప్పట్లో జిల్లాకు చెందిన మంత్రి చెప్పారని సుమారు 40 మందికి పట్టణ ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని వారికి అన్యాయం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మలేరియా, ఫైలేరియా విభాగంలో పని చేసే సుమారు 70 మంది హెల్త్ అసిస్టెంట్లు పట్టణ ప్రాంతాల్లోనే పనిచేస్తూ వ్యాపారాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా జరిగిన రీడిప్లాయ్మెంట్‌లో కూడా ఆ 70 మంది పేర్లు లేకుండానే జాబితాను రూపొందించారని హెల్త్ అసిస్టెంట్లు ఆరోపిస్తున్నారు.

పలుమార్లు మార్పులు..

ఒకే రోజులో సీనియార్టీ జాబితాను గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలోని మినిస్టీరియల్ సిబ్బంది పలుమార్లు మార్పులు చేశారని సమాచారం. ఆ మార్పుల వల్ల మొదటి జాబితాలో 20వ స్థానంలో ఉన్న వ్యక్తి రెండో జాబితాలో 60వ స్థానంలోకి వెళ్లినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

రీడిప్లాయ్మెంట్‌ను రద్దు చేయాలి

హడావిడి రీడిప్లాయ్మెంట్‌లో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. ఇష్టానుసారంగా చేస్తే అభ్యర్థులు నేతల నుంచి ఒత్తిడి చేయిస్తారని ప్రస్తుతం వారు అందుబాటులో లేని సమయంలో హడావిడి చేశారు. కార్యాలయంలో జాబితా సక్రమంగా రూపొందించే సిబ్బందే లేరు. రీడిప్లాయ్మెంట్ ప్రక్రియలో కొందరిని ఎందుకు మినహాయించారో చెప్పాలి. ఈ ప్రక్రియను రద్దు చేసి పారదర్శకంగా చేపట్టాలి.



-ఎం భానుమూర్తి, తెలుగు నాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

వైభవంగా అద్దంకి నాంచారమ్మ తిరునాళ్ల

- అశేష భక్తుల నడుమ శిడిమహోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారు

పర్చూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): పర్చూరు లో వేంచేసిన గ్రామదేవత అద్దంకి నాంచారమ్మ తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. వేకువ జామునే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పశువులను, వాహనాలను ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. మేకపోతును పూజించి, అమ్మవారిని ఆవహింపజేసి, అ మేకపోతులో శిడిమానును ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. శిడిమానుకు వరి, మిరప, మొక్కజొన్న కంకులను వేలాడతీసి రైతులు తమ భక్తిని చాటుకున్నారు. పాడిపంటలు బాగా పండాలని గ్రామం సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు వేడుకున్నారు.

అశేష జనాల మధ్య తిరునాళ్ల


అమ్మవారి తిరునాళ్ళ వేడుకలను తిలకించేందుకు తరలి వచ్చిన భక్తులు

అశేష భక్తుల మధ్య తిరునాళ్ల వేడుకలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కొల్లా రాజేశ్వరరావు నేతృత్వంలో అన్నదానం జరిగింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి దామా నాగేశ్వరరావు, వంశపారంపర్య అర్చకులు తులసివారు, పెద్దకాపు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు మాల్యాద్రి, వెంకటత్నం బందోబస్తు ఏర్పాటు చేశారు.



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.





నాటుసారాతో జీవితాలు అగమ్యగోచరం

● ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు



అవగాహన నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా సేవించడం వలన అనారో గ్యాల బారిన పడి జీవితాలు అగమ్య గోచరంగా మారుతాయని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళ వారం సీఐ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వాడరేవు, రామానగర్, చీరాల పట్టణంలో కళాజాతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, రెడ్‌క్రాస్ జిల్లా మేనేజర్ దాసరి ఇమ్మానియేల్, డీ ఎడిక్షన్ సెంటర్ ప్రాజెక్టు డైరక్టర్ సయ్యద్ నాగూర్ బాషా, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

1833 మంది పొగాకు రైతుల పేర్లు నమోదు

ఇంకొల్లు,మే 27,(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నల్లబర్లీ పొగాకు సాగుచేసిన 1833 మంది రైతుల పేర్లు రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసినట్లు ఏవో వేణుగోపాల్ తెలిపారు. మండలంలో సుమారుగా 8వేల ఎకరాలలో లక్ష క్వింటాల పొగాకును రైతులు పండించినట్లు ఆయన తెలిపారు. పొగాకు పండించిన రైతులు ఆయా గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహాలు ఉన్న రైతులు వ్యవసాయ కార్యాలయ సమయంలో సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.

పెండింగ్‌లో ఉన్న గృహాలు పూర్తిచేయాలి

ఇంకొల్లు,మే 27,(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పెండింగులో ఉన్న గృహాలను జూన్10 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. 2021-22 లెక్కల ప్రకారం ఇంకొల్లు మండలంకు 1036 గృహాలు మంజూరు కాగా 22 పూర్తయ్యాయని, 19 స్లాబ్‌దశలో, 69 బేస్‌మెంట్ దశలో, 41 బేస్మెంట్ లెవల్‌కు తక్కువలో ఉన్నాయన్నారు. అసలు మొదలు కానివి 343 ఉన్నట్లు తెలిపారు.పెండింగులో ఉన్న గృహాల నిర్మాణం వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, గృహనిర్మాణశాఖ ఏఈ రామకృష్ణలకు సూచించారు.

రేషన్ దుకాణాల వద్దే సరుకుల పంపిణీ

డీలర్లకు తహసీల్దార్ ఆంజనేయరెడ్డి సూచన

గిద్దలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూన్ 1వ తేది నుంచి రేషన్ సరుకులు రేషన్‌షాపుల వద్దనే పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి డీలర్లకు సూచించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేది వరకు రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వాలని పేర్కొన్నారు. తూకాలు తక్కువ ఇచ్చినా, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ రామనారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రావు, గ్రామ రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక వాహనాలలో మహానాడుకు తరలిన నేతలు



మహానాడుకు బయలుదేరుతూ నినాదాలు చేస్తున్న నేతలు, కార్యకర్తలు

పంగులూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు మంగళవారం రాత్రి టీడీపీ మండల నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ముప్పవరంలోని టీడీపీ మండల కార్యాలయానికి చేరుకున్న నేతలు ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం 'టీడీపీ జిందాబాద్, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, గొట్టిపాటి జిందాబాద్' అని నినాదాలు చేస్తూ, 12 కార్లు, మినీ బస్సులో పార్టీశ్రేణులు అధిక సంఖ్యలో బయలుదేరారు. మండల నేతలు అల్లంనేని బ్రహ్మానందస్వామి, బొరెడ్డి ఓబుల్‌రెడ్డి, నార్నె సుబ్బారావు, మస్తాన్‌వలి, గరిమిడి జగన్మోహనరావు, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉన్నం రవిబాబు, మురకొండ సుబ్బారావు, బత్తుల వెంకటరావు, శ్రీనివాసరావు, కాజా,భూమా పెద్దిరెడ్డి, వేల్పుల మరియదాసులతో పాటు పలు గ్రామాల నేతలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న రామకృష్ణ

అద్దంకి : బాపట్ల జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ టీడీపీ నిర్వహించే మహానాడుకు హాజరుకావడంతో పాటు రక్తదానం చేస్తున్నారు. రామకృష్ణ ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేయగా 22 సార్లు మహానాడులలో కావడం విశేషం. 2001లో జరిగిన మహానాడులో తొలిసారి రక్తదానం చేసిన రామకృష్ణ అనంతరం కూడా అదే విధంగా కొనసాగిస్తున్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో కూడా మంగళవారం నాగినేని రామకృష్ణ రక్తదానం చేశారు. ఆయనకు సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రక్తదానం సర్టిఫికేట్‌ను అందజేసి అభినందించారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా రామకృష్ణను అభినందించారు.

మహానాడుకు చీరాల నుంచి ప్రత్యేక కారు

చీరాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : మంగళ వారం నుంచి గురువారం వరకు కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు చీరాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. అందుకు సంబంధించి ఎమ్మెల్యే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయితే పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు ప్రత్యేకంగా తన కారును సిద్ధం చేసుకున్నారు. పదిరోజుల ముందు నుంచే కారు మొత్తం పసుపు రంగుతో నింపారు. అలాగే కారుపై దివంగత నందమూరి తారక రామారావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌తో పాటు చీరాల ఎమ్మెల్యే కొండయ్య, నియోజక వర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమర్నాథ్ చిత్రాలను అద్భుతంగా ఏర్పాటు చేశారు. దీంతో కారుతో ఫోటోలు దిగేందుకు అందరూ ఉత్సాహం కనబరిచారు.



మహానాడుకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన కారుతో టీడీపీ నాయకుడు గజవలి

జిల్లా జైలును పరిశీలించిన ఎస్పీ

ఒంగోలు క్రైం,మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా జైలులో భద్రతను, బ్యారక్‌లు, వైద్య సదుపాయాలు, పరిసరాలను ఎస్పీ దామోదర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం అంతర్గత భద్రతపై అధికారులతో సమావేశమయ్యారు. అక్కడ తీసుకోవాల్సిన కొన్ని భద్రత చర్యలపై సూచనలు చేశారు. రిమాండ్ ఖైదీలను తరలించే సమయంలో జైలు అధికారులు, పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. మహిళా ఖైదీలకు ప్రత్యేక భద్రత కల్పించాలని అన్నారు. సమావేశంలో జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు విజయకృష్ణ, నాగరాజు, శ్రీనివాసరావు, పాండురంగారావు, జైలర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జైలులో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

'నమస్తే'తో 'వేస్ట్ పిక్కర్ల'కు ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : 'నమస్తే' పథకం ద్వారా వేస్ట్ పిక్కర్ల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని కృషి స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ సమన్వకర్త అనీల్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక రోశయ్య కాలనీలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీబీఆర్‌సీ(దళిత బహుజన రిసోర్స్ సెంటర్)భాగస్వామ్యంతో చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ డబ్బాలు సేకరణ కార్మికుల నమోదు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సెంటర్ సమన్వయకర్త భగవాన్‌దాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దాసరి నాగేశ్వరరావు, ప్రవీణ్, మోహన్‌రావు, తిరుమలరావు, వీరస్వామి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ముండ్లమూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గంజాయి విక్రయానికి పాల్పడుతున్న నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన నాగులూరి సిద్ధు అనే నిందితుడిని మంగళవారం ఎస్ఐ కమలాకర్ అరెస్టు చేసి దర్శి కోర్టులో హాజరు పరిచారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మండలంలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన నలుగురు నిందితులను అరెస్టు చేయగా అప్పటినుంచి సిద్ధు పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడని ఎస్ఐ కమలాకర్ చెప్పారు. అందిన సమాచారంతో నిందితుడ్ని చాకచక్యంతో పట్టుకున్నామన్నారు.

దర్శికి ఆటిజం కేంద్రం మంజూరు

దర్శి, మే 27(ఆంధ్రజ్యోతి) : మానసిక ఎదుగుదల లోపం కారణంగా జన్మించిన చిన్నారుల్లో ఆటిజం సమస్య ఎక్కువగా ఉం టుందని జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త నాగేంద్రనాయక్ తెలిపారు. చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 127 ఆటిజం కేంద్రాలను మంజూరు చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా దర్శి మున్సిపాలిటీలో నూతనంగా ఆటిజం కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేం ద్రం ద్వారా ఆటిజం సమస్యతో బాధపడుతున్న విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు తెచ్చి విజ్ఞానవంతులుగా తయారు చేసేందు కు కృషి చేస్తామన్నారు. నూతన భవన నిర్మాణానికి రూ.27.75 లక్షల నిధులు మంజూరైనట్లు ఆయన చెప్పారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు స్థానిక మోడల్ స్కూల్లో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. ఎంఈవోలు కె రఘురామయ్య, రబాదేవి, రీసోర్స్‌పర్సన్లు ఎం. శ్రీనివాసులు, జి. సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

దర్శి, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పువీరాయపాలెంలో మంగళవారం మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ మురళి కథనం ప్రకారం.. సీహెచ్ వెంకటరత్నం(30) భర్త మందలించడంతో మనస్తాపం చెంది, ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వెంకటరత్నం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

అవీ..ఇవీ..

విద్యార్థులకు వేసవి శిక్షణ

పంగులూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైటమంజులూరు గ్రామంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రెండురోజుల వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉపాధ్యాయుడు బి.రామాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 29, 30 తేదీలలో జరిగే శిక్షణ కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ గెస్ట్ ప్రొఫసర్ ఎస్.లెనిన్‌బాబు పాల్గొంటారన్నారు. గణిత సులభ పరిచయం కార్యక్రమం జరుగుతందన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు జరిగే ఈ శిక్షణను స్థానిక విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నియంత్రణ క్రోన్లు ఏర్పాటు

● తోడ్పాటు అందించిన ఐవోసీ డీలరు

ఇంకొల్లు, మే 27, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఐవోసీ డీలరు బెల్లంకొండ వాసుదేవరావు సహకారంతో సుమారు 50 ట్రాఫిక్ నియంత్రణ క్రోన్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఇప్పటికే ట్రాఫిక్ నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సురేష్ తెలిపారు. ప్రధాన రహదారిలో వేగాన్ని నియంత్రించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండేందుకు దాతల సహకారంతో కోన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

110 మందికి ఉచితవైద్య సేవలు

ఇంకొల్లు,మే 27,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణికిలో గ్రామ టీడీపీ అధ్యక్షులు గుది సీతారామయ్య, ఇంకొల్లు నీటిసంఘం అధ్యక్షులు గుది మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఇంకొల్లు చెరుకూరి హాస్పిటల్స్ వారు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎముకలు కీళ్ల, షుగర్, బీపీ, చిన్నపిల్లల సంబంధిత వైద్యపరీక్షలు నిర్వహించారు. 110 మందికి ఉచిత వైద్యసేవలు అందించారు. చెరుకూరి ఆస్పత్రి సంబంధించిన ఉచిత హెల్త్‌కార్డులను 20 మందికి అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అధినేత దావులూరి సంజీవరావు, వైద్యులు డాక్టరు అమూల్య, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న అయ్యప్ప దీక్ష ప్రచారసమితీ సభ్యులు

అద్దంకి, మే27(ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అమవాస్య సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం పాతబస్టాండ్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఆకుల రామశేషారావు జ్ఞాపకార్థం కుమారుడు శివరామకృష్ణ సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసు గురుస్వామి, తిరుపతిరెడ్డి గురుస్వామి, పెద్దన్న గురుస్వామి, కొండ్రగుంట శ్రీనివాసరావు, మంగమూరి సురేష్, తోట చంద్రశేఖర్, గురునాథం వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, ఆకుల శివరామకృష్ణ, అమరా శ్రీనివాసరావు, కురిచేటి వెంకటసుబ్బారావు(చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యంసేవిస్తే చర్యలు

● ముక్తేశ్వరంలో డ్రోన్ ఎగురవేసిన ఎస్ఐ



డ్రోన్‌ను ఎగుర వేస్తున్న ఎస్ఐ నాగరాజు

బల్లికురవ, మే 27 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాలలో ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఎవరైన మద్యంసేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వై.నాగరాజు హెచ్చరించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'దేవాలయం ముందే మందు పార్టీలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ నాగరాజు వెంటనే స్పందించారు. ముక్తేశ్వరం గ్రామంలో డ్రోన్‌ను ఎగుర వేశారు. ఎవరైన పంట పొలాల్లో గానీ, బహిరంగ ప్రదేశంలో గాని మద్యం సేవించినా, జూదం ఆడినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. డ్రోన్ ఎగరడంతో ముక్తేశ్వరం గ్రామంలో మందుబాబులు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యారు. డ్రోన్ గ్రామంలో నలువైపులా తిరిగి ప్రజల కదలికలను ఫోటోలను తీసింది. దీంతో అసాంఘీక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘాకు పోలీసు శాఖ శ్రీకారం చుట్టింది. ఇక నుంచి ఎవరైన మద్యం సేవిస్తే వెంటనే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మార్టూరు,మే27(ఆంధ్రజ్యోతి): ఇంటిలో శరీరంపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకొని బి.స్వామి అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని కోనంకి గ్రామంలో ఎస్సీకాలనీలో చోటుచేసుకొంది. వ్యవసాయ కూలిగా జీవనం వెళ్లదీసే స్వామి కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యకు యత్నించినట్లు కాలనీవాసులు తెలిపారు. ఆయన శరీరంపై కొంతమేర పెట్రోలు పడి మంటలు వ్యాపించడంతో సమీపంలోని వ్యక్తులు వెంటనే మంటలను ఆర్పివేసి 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో కాలనీకి 108 వాహనం వెళ్లి బాధితుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డీలర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ఇంకొల్లు, మే 27,(ఆంధ్రజ్యోతి) : రేషన్‌డీలర్లు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ వెంకటరత్నం సూచించారు. ఇంకొల్లు మండలంలోని నూతన రేషన్‌డీలర్లతో మంగళవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు రేషన్‌దుకాణాలు తప్పనిసరిగా తెరచి ఉంచాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అర్థమయ్యేలా డిస్ప్లేలో ఉంచాలన్నారు. జూన్ 1వ తేదీ నుండి వినియోగదారులకు రేషన్ అందజేయనున్నట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు.

యోగాతో ప్రశాంతత, ఆరోగ్యం



యోగాసనం వేస్తున్న విద్యార్థి

చీరాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ యోగాసనాలు వేయడం ద్వారా ప్రశాంతమైన ఆరోగ్యాన్ని పొందుతారని సుబేదార్ నజీర్‌అహ్మద్, మేజర్ బీఎస్ఆర్‌కే రాజు, బీహెచ్ఎం రమేష్ పేర్కొన్నారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా మంగళవారం యోగా ఏరోబిక్స్ నిర్వహించారు. అందులో పలువురు విద్యార్థులు, ప్రతినిధులు హాజరై ఆసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు చెరువులకు చేరేనా..?

● ఏబీసీ కాలువకు తాగునీటి అవసరాలకు విడుదలైన నీరు ● చౌర్యం చేస్తున్న చేపల చెరువుల నిర్వాహకులు



తాగునీటి అవసరాలకు విడుదలైన సాగర్ జలాలు

బల్లికురవ. మే 27 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండల ప్రభావంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు సాగర్ డ్యాం నుంచి నీటిని నాలుగు రోజుల క్రితం అద్దంకి బ్రాంచ్ కాలువకు విడుదల చేసింది. మంగళవారానికి పూర్తిస్థాయిలో కాలువలకు నీరు చేరుతోంది. తాగునీటి అవసరాలకు విడుదల చేసిన సాగర్ నీరు పదిరోజుల వరకు మాత్రమే వచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ ఆ నీటిని చెరువులకు చేరక ముందే చేపల చెరువుల నిర్వాహకులు కాలువలకు అడ్డు వేసి మళ్లిస్తున్నారు. ఇలా అయితే సాగర్ జలాలు తాగునీటి చెరువులకు సకాలంలో ఎలా చేరతాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.



రామాంజనేయపురం గ్రామ సమీపంలోని చేపల చెరువుకు చేరుతున్న సాగర్ నీరు

లోపిస్తున్న అధికారుల పర్యవేక్షణ

అధికారల పర్యవేక్షణ లేకపోవడంతో తాగునీరు చౌర్యానికి గురవుతోంది. బల్లికురవ మండలం ముక్తేశ్వరం పంచాయతీ రామాంజనేయపురం సమీపంలో ఉన్న చేపల చెరువుకు మంగళవారం ఎలాంటి అనుమతులు లేకుండా నీటిని మళ్లించి నింపుతున్నారు. ఏబీసీ కాలువ దిగువ ప్రాంతంలో ఉన్న మంచి నీటి చెరువులకు సాగర్ నీరు చేరాల్సి ఉంది. కాని ఎగువ ప్రాంతంలో చేపల చెరువులకు నీటిని పెడితే తాగునీటి చెరువుల పరిస్థితి ఏమిటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని వల్లాపల్లి వద్ద ఉన్న 33వ మైలు వద్దకు సుమారు 600 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇంత తక్కువ నీరు వస్తే తాగునీటి చెరువులకు వెళ్లే మేజర్ల పైపులకు నీరు ఎక్కడం కష్టం అని ప్రజలు అంటున్నారు. గ్రామాలలో ఉన్న పంచాయతీ, రెవెన్యూ, ఎన్ఎస్పీ అధికారులు అందరు సమన్వయంతో ఏబీసీ కాలువపై పర్యటించి తాగునీరు చేపల చెరువుకు చేరకుండా తాగునీటి చెరువులకు మాత్రమే చేరేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● అజిత్ ట్రస్ట్ వితరణ అభినందనీయం
● డిప్యూటీ డీఈవో గంగాధర్



హరికకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందచేస్తున్న డిప్యూటీ డీఈవో గంగాధర్

పంగులూరు, మే 27(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు కృషి, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చీరాల డివిజన్ డిప్యూటీ ఈవో గంగాధర్ అన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వివిధ పాఠశాలల విద్యార్థుల అభినందన సభ మంగళవారం నిర్వహించారు. అజిత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చందలూరు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గిరిజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కొర్రపాటి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సమాజంలో అన్ని రంగాలలో రాణిస్తారన్నారు. సేవా దృక్పథంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తున్న అజిత్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. పిల్లలలో నిక్షిప్తమయిన సృజనాత్మకతను గుర్తించి మంచి విద్యాబోధన ద్వారా ఉపాధ్యాయులు వారిని ఉన్నతులుగా తీర్చిద్దాలని ప్రముఖ కవి బీరం సుందరరావు, విశ్రాంత ప్రొఫసర్ బత్తుల వీరనారాయణ సూచించారు.



యోగాసనాలు వేస్తన్న విద్యార్థి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 590 మార్కులు సాధించిన కట్టా హరిక, 586 మార్కులు సాధించిన మణిదీపక్‌రెడ్డి, 585 మార్కులు సాధించిన బూదవాడ విద్యార్థిని భవనం దివ్యలతో పాటు పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, డాక్టర్ రవికాంత్, పేర్ని వీరనారాయణ, ఎంఈవో వీరాంజనేయులు, శ్రీనివాసరావు, హెచ్ఎం. అనిత, గంగాధర్, నార్నె తాతయ్య, కమలేశ్వరరావు, ఎస్ఆర్ఐ సుమతి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల బాలబాలికలు ప్రదర్శించిన యోగసనాలు, భరతనాట్యం అలరించాయి.

వైభవంగా దశసహస్ర కదళీఫలార్చన



కదళీఫలార్చనలో స్వామివారు

అద్దంకి, మే 27 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమ వాస్య సందర్భంగా మంగళవారం దశ సహస్ర కదళీఫలార్చన వైభవంగా నిర్వహించారు. అద్దంకి పట్టణానికి చెందిన ఘంటసాల శ్రీనివాసరావు, రాధిక దంపతులు ఉభయదాతలుగా పాల్గొన్నారు. వేదపండితులు, పూజారులు, ఉభయదాతలు ఉదయం ఆలయ ప్రదక్షణలు, పరివార దేవతల పూజలు నిర్వహించారు. అనంతరం 11 ఆవృత్తాలుగా 10 వేల అరటిపండ్ల తో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం కావటం, అమవాస్య పూజలు కూడా కలిసి రావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శిం చుకున్నారు. ఆకుపూజలు, వాహన పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కరణం వెంకటేష్ ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కరణం వెంకటేష్

చీరాల వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ప్రసన్నాంజనేయ స్వామి, లక్ష్మీనరశింహస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు పూజారులు ఆశీర్వచనం అందించారు. వైసీపీ నేతలు గునుపూడి రఘురామగుప్తా, త్రివేణి, కూరపాటి రామ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై కేంద్రబృందం పరిశీలన



ముప్పవరంలో నిర్మించిన కంపోస్ట్ పిట్‌ను పరిశీలిస్తున్న బృందం

పంగులూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం, కల్లంవారిపాలెం గ్రామాలలో మంగళవారం కేంద్రబృందం ప్రతినిదులు పర్యటించారు. ఈ రెండు గ్రామాలలో వివిధ శాఖల ద్వారా ఎన్‌ఆర్‌ఈజీఎస్. నిధులతో చేపట్టిన పనులను ఏరియా అధికారి అనిల్‌కుమార్, సెక్షన్ అధికారి అరుణ్‌కుమార్‌లు పరిశీలించారు. ముప్పవరంలో పిన్నక నాగమల్లేశ్వరి ఉపాధి నిధులతో సాగుచేస్తున్న మామిడితోటను పరిశీలించి వస్తున్న ఫలసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మితమైన సీసీరోడ్లుతో పాటు వర్మీ కంపోస్ట్ బిట్, క్యాటిల్ షెడ్లను పరిశీలించారు. నిర్మాణ వ్యయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కల్లంవారిపాలెం గ్రామంలో రైతు సాగర్‌రెడ్డి సాగుచేస్తున్న తైవాన్ జామతోటను కేంద్ర బృందం ప్రతినిధులు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న క్యాటిల్ షెడ్ పనులను పరిశీలించారు. గ్రామాలలో ప్రభుత్వ నిధులతో పూర్తయిన పక్కా గృహాలను, వాటికి వినియోగించిన మ్యాన్ డేట్స్‌ను రికార్డులలో తనిఖీ చేశారు. వీరి వెంట డ్వామా ఏపీడీ. కోటనాయక్, ఏపీవో సంతోషం, పీఆర్, హౌసింగ్ ఏఈలు హనుమంతరావు, కిషోర్‌కుమార్, పశువైద్యాదికారి డాక్టర్ కిరణ్, వెలుగు డీపీఎం సుబ్బారావు, ఏపీఎం జ్యోతిప్రసాద్, సర్పంచులు రౌతు సాంబశివరావు, గుడిపాటి శ్రీనివాసరెడ్డి, సాంకేతిక సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లలో తహసీల్దార్ తనిఖీలు

హద్దురాళ్లు తొలగించి కార్యాలయానికి తరలింపు



లే-అవుట్‌ను తరలిస్తున్న తహసీల్దార్

వేటపాలెం(చీరాల), మే 27 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం నాయినిపల్లిలో అసైన్డ్ భూముల్లో నిర్వహిస్తున్న అక్రమ లే-అవుట్‌లపై తహసీల్దార్ పార్వతి ఉన్నతాధికారుల ఆదేశాల తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో సర్వే నెం. 461/1 ఏ లో 1.90 ఎకరాల అసైన్డ్ భూమిలో అనధికారంగా లే-అవుట్‌లు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. సిబ్బంది సహాయంతో వాటిని తొలగించి కార్యాలయానికి తరలించారు. మండల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. తహసీల్దార్ వెంట డీటీ శ్రీకాంత్, సర్వేయర్ శ్రీనివాసరావు, సెక్రటరీ రామ్మోహన్, వీఆర్వో రఫీ, సుబ్బారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలి



పేడదిబ్బలను తీయిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ. మే 27 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరిం చాలని ఎంపీడీవో కే.కుసుమకుమారి కోరారు. మంగళవారం మండలంలోని వైదన, ముక్తే శ్వరం గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూరేపల్లి గ్రామంలో రోడ్డువెంబడి వేసిన పేడదిబ్బలను దగ్గర ఉండి పంచాయతీ సిబ్బందితో తీయించారు. ప్రజలకు చెత్త డబ్బాలను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతు రోడ్ల వెంబడి ఎవరైన చెత్తవేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజు ఇంటింటి నుంచి చెత్త సేకరణకు రిక్షాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు కూడా స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సభలలో పంచాయతీ కార్యదర్శులు షేక్ మీరావలి, ప్రసాదరావు, గ్రామాలలో ఉన్న రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని వినతి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

చీరాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల నుంచి మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందేందుకు వెళ్లే ప్రజలకు నేరుగా బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని స్థానిక బిజెపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డిపో మేనేజర్ జంజనం శ్యామలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం చీరాల నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు, మంగళగిరి ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నట్లు వారు తెలిపారు. ఈక్రమంలో 80 కిలోమీటర్లు దూరం ఉన్న ఎయిమ్స్ వైద్యశాలకు మూడు బస్‌లు మారాల్సి వస్తుందని, అత్యవసర వైద్య సేవల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నేరుగా బస్ సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిఎంను కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు జి.భవాని, మన్నవ సుజాత, తెల్లాకుల అయ్యప్ప, గోలి సాయి, పింజల భరణి, ఎం భరణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భవితకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ప్రత్యేక అవసరాలున్న పిల్లలను సర్వే చేస్తున్న ఎంఈవో సుధాకరరావు

అద్దంకిటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన భవితకేంద్రంలో అందించే సేవలను ఆయా చిన్నారులకు అందించేలా చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగపర్చుకోవాలని ఎంఈవో-2 బూదాటి సుధాకరరావు అన్నారు. మంగళవారం అద్దంకిలోని గుర్రలకాలనీలో ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల కోసం సర్వే కార్యక్రమం భవత కేంద్రం ఉపాధ్యాయలు చేపట్టారు. కార్యక్రమాన్ని ఎంఈవో సుధాకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సమగ్రశిక్ష ఆదేశాల మేరకు జూన్ నెల 9వ తేదీ వరకు ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. 0 నుండి 18 సంవత్సరాల లోపు వినికిడి, దృష్టిలోపం, మానసిక వైకల్యం, శారీరక అంగవైకల్యం, ఆటిజం తదితర 21 రకాల వైకల్యాలున్న పిల్లలను గుర్తించి సమీప పాఠశాలలో నమోదు చేయించాలన్నారు. అందుకు అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తల ద్వారా సమాచారాన్ని తీసుకుని సంబంధిత విద్యార్థులను బడిలో చేర్పించి వారి ప్రత్యేకంగా విద్యా నేర్పడంతో పాటు ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అద్దంకిలో పీఎంశ్రీ పథకం ద్వారా 27 లక్షలతో ఆటిజం కేంద్రం మంజూరయిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలతో జీవితాలు చిన్నాభిన్నం



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

చీరాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : మూఢనమ్మకాలతో కుటుంబాలు చిన్నాభిన్నమవు తాయని, ప్రతిఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం పట్టణంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ జీవన మనుగడకు సైన్స్ ప్రయోజనకరమని చెప్పారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యంలో సోషల్ మీడియా ద్వారా ప్రజలు చెడు మార్గాలకు చేరువవుతున్నట్లు వివరించారు. పుస్తకాలతోనే సన్మార్గాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో గుంటుపల్లి సుబ్బారావు, జేవీవీ జిల్లా అధ్యక్షులు భాస్కరరావు, డివిజన్ నాయకులు పిచ్చయ్య, హేమంత్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు భిక్షాలుబాబు, మాల్యాద్రి, శ్రీనివాసరావు, జయరాజు, నారపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్యం కోసం రూ.80వేల మంజూరు



ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న కరిముల్లా

అద్దంకి, మే27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణికేశ్వరానికి చెందిన గండి ఇషాంత్ అత్యవసర శస్త్రచికిత్స చేయాల్సి రావడంతో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిఫారసుతో సీఎంఆర్ఎఫ్ నుంచి ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.80వేలు మంజూరయ్యాయి. మంజూరు పత్రాన్ని మంగళవారం ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ కరిముల్లా ఇషాంత్ తండ్రికి అందజేశారు.

కరోనా.. మళ్లీనా!?

- భీతిల్లుతున్న జిల్లావాసులు
- ఆందోళన వద్దంటున్న వైద్య నిపుణులు



నెల్లూరు (వైద్యం) మే 27 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్.. ఈ పేరు చెబితేనే జిల్లావాసుల్లో వణుకు పుడుతుంది. సరిగ్గా రెండేళ్ల క్రితం వరకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ఆ మహమ్మారి మళ్లీ విస్తరిస్తోందని ప్రచార మాధ్యమాల ద్వారా తెలియడంతో ప్రజల్లో ఆందోళన రేగుతోంది. ఇప్పటికే కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీలో 1009 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇక మనరాష్ట్రంలో విశాఖ, తణుకుల లో రెండు కేసులు నమోదైనట్లు సమా చారం. కరోనా వెలుగు చూసిన రాష్ట్రాలతో జిల్లావాసు లు వివిధ వ్యాపారాల రీత్యా వెళు తుండటంతో ఎక్కడ కరోనా భారి న పడాల్సి వస్తుందోనని భీతిల్లు తున్నారు. 2019, మార్చి 11వ తేదీన రాష్ట్రంలోనే నెల్లూరు లో తొలికేసు నమోదయింది. 2022, వరకు నాలుగు విడతలుగా 1.66 లక్షలకు పైగా కరోనా కేసులు జిల్లాలో నమోదు అయ్యాయి. 336 మంది జిల్లాలో మృత్యువాత పడ్డారు. ఇప్పుడు మళ్లీ కరోనా విస్తరిస్తోందని తెలియడంతో ప్రజ ల్లో ఆందోళన నెలకొంది. అయితే ప్రస్తుతం నమోదవుతున్న ఎన్‌బీ 1.8.1, ఎల్ఎఫ్ వేరియెంట్‌పై పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్ సార్స్ కోవ్-2 జెనోమిక్స్ కన్సార్టియం స్పష్టం చేస్తోంది. మరోవైపు కేసుల ఉధృతి నేపథ్యంలో త్వరలోనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు పలు ఆదేశాలు అందే అవకాశం ఉంది.

ఎలాంటి ఆదేశాలు అందలేదు



ఇప్పటివరకు వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. అయితే జిల్లాలో కరోనా కేసులు ఎక్కడ నమోద యినా రాష్ట్ర అధికా రుల సూచనల మేరకు వెంటనే వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాము. ఇప్పటి కరోనా వేరియెం ట్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవ సరం లేదు.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



జీజీహెచ్‌లో ప్రత్యేక విభాగం

జిల్లాలో కరోనా కేసులు నమోద యితే వారికి వెంటనే వైద్యసేవలు అందించేందుకు నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తక్షణం 30 పడకలతో ప్రత్యేక విభాగం ఏర్పాటుకు అధికా రులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో 20 పడ కలు సాధారణ కేసులకు కేటాయిస్తున్నారు. అన్ని రకాల మందులు అందు బాటులో ఉంచారు. శ్వాసకోశ వైద్య నిపుణులు కూడా అందుబాటులో ఉండనున్నారు.

జీజీహెచ్‌లో 30 పడకల ఏర్పాటు



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కరోనా బాధితులకు వెంటనే వైద్య చికిత్సలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాము. ఇందు కోసం శ్వాసకోశ విభాగంలో 30 ప్రత్యేక పడకలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో 10 పడకలు ఐసీయూకే కేటాయించాము. వ్యాధిగ్రస్థులకు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచుతున్నాం. అవసరమైన ఆక్సిజన్ కూడా తగినంత అందుబాటులో ఉంది.

- డాక్టర్ సిద్దానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్



కోవూరు : కడపలో టీడీపీ శ్రేణులతో కలిసి మహానాడు ప్రాంగణానికి వెళుతున్న వేమిరెడ్డి దంపతులు

మహా ఉత్సాహం

టీడీపీలో మహానాడు జోష్ ● కడపకు తరలిన ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు

మహానాడు.. తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. రాష్ట్రంలో అధి కారం చేపట్టి సరిగ్గా సంవత్సరం సమీపిస్తుండటం.. ఈ తరుణంలోనే కడపలో మహానాడు జరుగుతుండటంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ నెల కొంది. మంగళవారం ప్రారంభమైన ఈ మహా వేడుకలో పాల్గొనేందుకు ఉదయా న్నే ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు పార్టీ ప్రతినిధులూ తమ అనుచ రగణంతో తరలివెళ్లారు. గురువారం జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు వాహన సమీకరణ చేసుకుంటున్నారు.

● **కోవూరు :** కడపలో జరుగుతున్న మహానాడులో మంగళవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రదర్శనగా నడిచి హుషారెత్తించారు. కడపలోని విడిది కేంద్రం నుంచి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ పబ్బాపురంలోని మహానాడు వేదిక వద్దకు చేరుకున్నారు. అంతక ముందు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో విడిది కేంద్రం కోలాహ లంగా మారింది. టీడీపీ నాయకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పెళ్లకూరు శ్రీని వాసులురెడ్డి, చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి బాధ్యతలు తీసుకుని సభల విజయ వంతానికి కృషి చేస్తున్నారు.



వింజమూరు : కార్యకర్తలతో మహానాడుకు వెళుతున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● **వింజమూరు :** మహానాడుకు ఉదయగిరి నియోజకవర్గం నుంచి ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు వివిధ వాహనాల్లో కడపకు తరలివె ళ్లారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టీడీపీ జెండా ఊపి వాహనాలను ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, వని పెంట సుబ్బారెడ్డి, నియోజకవర్గ పరిధిలోని 8 మండలాల కన్వీనర్లు, ముఖ్య నేతలు, తదితరులు పాల్గొ న్నారు.



మహానాడు ప్రాంగణంలో అల్లూరు నేతలు



కడపలో వెంకటాచలం నాయకులు

● **కావలి :** మహానాడుకు మంగళవారం ఉదయాన్నే కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి తన అనుచరులతో కలిసి వెళ్లారు. మహా నాడుకు ప్రాంగణంలో సీఎం చంద్ర బాబుతో మాట్లాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయించి ఆయన్ను అభినందించారు.



మహానాడులో టీడీపీ నేతలతో కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



అశ్వ వాహనంపై కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో మంగళవారం రాత్రి శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వారు అశ్వవాహ నంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ధ్వజపీఠాల వద్ద ధ్వజావరోహణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు కొడిముద్దలను సంతానం కోరి వచ్చిన భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం ఆలయం నుంచి అలిగివెళ్ళిన అమ్మవారిని స్వామివారు పెద్దలతో వెళ్ళి నచ్చజెప్పి తిరిగి ఆలయానికి తీసుకువచ్చిన అలకలతోపు సంప్రదాయ కార్యక్రమం ఆకట్టుకుంది. మంగళవారం రాత్రి అశ్వవాహనసేవ అనంతరం ఆలయంలోని శయన మందిరంలో ప్రత్యేక పుష్పాలంకరణతో ఏకాంత సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తి, లాలిపాటలు ఆలపించారు.

నేడు 'సామూహిక యోగాంధ్ర'

నెల్లూరు(విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో పర్యాటక ప్రదేశమైన ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం, స్వర్ణాల చెరువ ఒడ్డున బుధవారం సామూహిక యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ తెలిపారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ కార్యక్ర మంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పురపాలక, పర్యాటక, పట్టణ పేదరిక నిర్మూలన తదితర శాఖల అధికారులు అన్నీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. యోగాలో ఉత్సాహం చూపే వారందరు క్యూఆర్‌కోడ్ ద్వారా రిజిస్టర్ అయ్యే విధంగా చూడాలని సూచించారు.

నేడు రాష్ట్ర పండుగగా ఎన్టీఆర్ జయంతి : కలెక్టర్

నెల్లూరు (సాంస్కృతికం), మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రఖ్యాత సినీ నటుడు నందమూరి తారక రామారావు జయంతిని రాష్ట్ర పండుగగా బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతీ ఏటా ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండుగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలి పారు. బుధవారం ఉదయం 10గంటలకు నర్తకి సెంటర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పమాలలు సమర్పించడంతో పాటు కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన భవన్‌లో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, జిల్లా అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

దూసుకొచ్చిన మృత్యువు

- హైవే దాటుతున్న వారిని ఢీకొన్న లారీ
- తల్లీ కూతుళ్ల దుర్మరణం, మరో ఇద్దరికి గాయాలు
- గుడ్లూరు మండలం మోచర్ల వద్ద ఘోరం

గుడ్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : బంధువులతో కలిసి తమ ఇష్టదైవమైన పోలేర మ్మను దర్శించుకున్నారు. ఎంతో ఆనందంతో తిరిగి ఇంటికి వెళుతున్న వారిని ఓ లారీ మృత్యువులా దూసుకొచ్చింది. వేగం గా వచ్చి ఢీకొనడంతో తల్లీకూతుళ్లు అక్కడి కక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి గాయా లు అయ్యాయి. గుడ్లూరు మండలం మోచర్ల వద్ద మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటన ఆ గ్రామస్థుల్లో తీవ్ర శోకాన్ని మిగిల్చింది.

గుడ్లూరు మండలం మోచర్ల బీసీ కాల నీకి చెందిన గడ్డేటి రమాదేవి (46), ఈమె కుమార్తె దాసరి మమత (30) బంధువు లతో కలిసి మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని జాతీయ రహదారికి అవతల వైపు ఉన్న పోలేరమ్మను దర్శించుకున్నారు. తిరిగి 11 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి వచ్చేందుకు జాతీయ రహదారి దాటుతున్న సమయంలో కావలి నుంచి ఒంగోలు వైపు వెళుతున్న (ఏపీ39 యూఎఫ్8499) 16 చక్రాల లారీ వేగంగా వచ్చి తల్లీకూతుళ్లను ఢీకొంది. లారీ చక్రాల కింద రమాదేవి, మమత పడి మాంసపు ముద్దలా మారిపో యారు. అలాగే, మృతుల బంధువులైన వెంకటరమణమ్మ, వైష్ణవిలకు కూడా గాయాలు కావడంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. తల్లీ కూతుళ్ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియావై ద్యశాలకు తరలించారు. కాగా, మృతులో దాసరి మమతకు భర్త, ఇద్దరు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘోర ప్రమాదంతో మోచర్ల గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రమాదంపై కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.





మృతులు మమత, రమాదేవి

యానాదుల కోసం ప్రత్యేక సహకార సంఘం

- రాష్ట్రంలోనే మొదటగా రాపూరులో ఏర్పాటు
- వెయ్యి మందికి సభ్యత్వం
- జిల్లా సహకార అధికారి గురప్ప



గిరిజన సహకార సంఘ సభ్యులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న డీసీవో గురప్ప

నెల్లూరు (హరనాథపురం), మే 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రాపూ రులో యానాదుల కోసం రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా సహకార సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప చెప్పారు. మంగళవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో రాపూరు కు చెందిన యానాది వర్గ సభ్యులకు సహకార సంఘం రిజిస్ట్రేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాచీన గిరిజన తెగకు చెందిన యానాది కుటుంబాలను సమీకృతం చేసి, వారి జీవనోపాధులను మెరుగుపరచడానికి రాపూరులో షెడ్యూల్ తెగల వన్ ధన్ వికాస్ కేంద్ర పరస్పర సహాయక సహకార సంఘం రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. రాపూరు మండల పరిధిలోని వెలిగొండ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న సుమారు వెయ్యి మంది యానాదులను సంఘంలో సభ్యులుగా చేర్పిస్తామన్నారు. వారికి వెలిగొండ అటవీ ప్రాంతంలోనే కలపేతర అటవీ ఫల సాయం, ముడి సరుకుల ఉత్పత్తులను బ్రాండింగ్ చేసి మార్కెటింగ్ సౌకర్యం, ఆర్థిక సాధికారత కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో రాపూరు సబ్ డివిజన్ సహకార శాఖ అధికారి వీ రవికుమార్, డీసీవో కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.



కూలీలను విచారిస్తున్న పోలీసులు

'అగ్రిగోల్డ్' భూముల్లో మళ్లీ పుష్పాలు!

- జామాయిల్ చెట్లపై గొడ్డళ్ల వేటు
- లారీల్లో కలపను తరలించే యత్నం
- సీఐడీ, పోలీసులకు గ్రామస్థుల సమాచారం
- ఆరు వాహనాలతోపాటు 48 మంది కూలీలు అదుపులోకి..

ఉదయగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ భూముల్లో దొంగలు పడ్డారు. వారి గొడ్డళ్ల వేటుకు ఏపుగా పెరిగిన జామాయిల్ చెట్లు నేలకొరుగు తున్నాయి. అధికారమే అండగా మొన్న వరికుంటపాడు, కలిగిరి మండలాల్లో యథేచ్ఛగా జామాయిల్, ఎర్రచందనం, శ్రీగంధం చెట్లు నరికి సొమ్ము చేసుకు న్నారు. తాజాగా మంగళవారం ఉదయ గిరి మండలం తిరుమలాపురం పంచా యతీలో అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ చెట్లపై పడ్డారు. తిరుమలా పురం పంచాయతీలో అగ్రిగోల్డ్ సంస్థకు సుమారు 70 ఎకరాల భూములు ఉండ గా, సుమారు ఒకటిన్నర దశాబ్దం క్రితం సంస్థ జామాయిల్ సాగు చేపట్టింది. ప్రస్తుతం ఆ చెట్లు బాగా ఊరడం, ధర ఆశాజనకంగా ఉండటంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. ఇంకేముంది. మంగళ వారం తెల్లవారుజామునే 48 మంది కూలీలు, మూడు లారీలతో తోటల్లోకి చేరుకు న్నారు. గంటల వ్యవధిలోనే ఐదెకరాల్లో జామాయిల్ నరికి లారీలకు లోడ్ చేసి గుట్టుచప్పుడు కాకుండా తరలించేందుకు సిద్ధమయ్యారు. ఇది గుర్తించిన గ్రామస్థులు, అగ్రిగోల్డ్ సిబ్బంది వెంటనే పోలీసు, సీఐడీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఉదయగిరి ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ.శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కూలీలను విచారించారు. మూడు లారీలు, మూడు ఆటోలను స్వాధీనం తీసుకున్నారు. అలాగే 48 మంది కూలీలను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ వ్యవహారం వెనుక ఉన్న పుష్పా ఎవరో తెలియాల్సి ఉంది. సీఐడీ అధికారులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా అక్రమ జామాయిల్ నరికివేత వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులెవరో అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.



కర్రతో రవాణాకు సిద్ధంగా ఉన్న లారీ



సంచార వైద్యం.. పశువులకు దూరం

సంచార వైద్యం పశువులకు అందనంటోంది. రైతుల చెంతకే పశువైద్యం పేరుతో గత ప్రభు త్వం ఆర్భాటంగా ఈ వాహనాలను తీసుకురాగా, ఏడాదికాలంగా వీటి సేవలు ఆగిపోయాయి. మర్రిపాడు, అనంతసాగరం మండలాల కోసం ఓ సంచార వాహనాన్ని (అంబులెన్స్) అందుబాటులోకి తెచ్చారు. అయితే, ఏడాది కాలంగా ఎప్పుడు ఎక్కడ ఉంటుందో? ఎప్పుడు మరమ్మతులకు గురై షెడ్డుకు చేరుతుందో అంతుపట్టడం లేదు. గడిచిన నెల రోజుల వ్యవధిలో నాలుగు సార్లు మరమ్మతుకు గురైనట్లు సమాచారం. తాజాగా మరోమారు మరమ్మతుకు గురైన వాహనాన్ని మరో వాహన సాయంతో తీసుకుళుతున్న దృశ్యం ఇది

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

కాలువ స్థలం రక్షణకు చర్యలు

- హెచ్చరిక బోర్డులు పెట్టిన అధికారులు

నెల్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రామిరెడ్డి కాలువ భూముల రక్షణకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'కాలువ భూముల కబ్జా' కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా స్పందించి కాలువ స్థలాల కబ్జాను అడ్డుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు ఆక్రమణకు గురైన రామిరెడ్డి కాలువ స్థలంలో హెచ్చరిక బోర్డులు పాతారు. ఈ స్థలంలోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. అలానే ఆ కాలువ స్థలాన్ని ఆక్రమిం చిన వ్యక్తుల వివరాలు కూడా సేకరించారు. ఆక్రమణ దారులకు నోటీసులు పంపుతా మని ఇరిగేషన్ ఏఈ బాలసుబ్రహ్మణ్యం 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రామిరెడ్డి కాలువ స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టిన ఇరిగేషన్ అధికారులు

కావలి ఆర్టీసీకి ఇంధన అవార్డు

కావలి, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో అరుదైన అవార్డు దక్కిం చుకుంది. ఒక లీటరు డీజిల్‌కు 5.98 కి.మీ మైలేజ్ సాధించి నందుకు ఆర్టీసీ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇంధన సామర్థ్య అవార్డును అందజేశారు. ఈ మేరకు మంగళ వారం డిపోలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి మురళీ బాబు పాల్గొని డిపో మేనేజరు శ్రీనివాసులుకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను కావలి డిపోకు నిర్ధేశించిన ఇంధన పొదుపు లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. కావలి డిపో జిల్లాలోని మిగతా డిపో లకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఎస్కే ఖాజా మొహిద్దీన్, అసిస్టెంట్ మేనేజరు కల్పన, కేఎంపీఎల్ మెకానిక్ పాండు రంగా రావు, ట్రాఫిక్, గ్యారేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కావలి డీఎం శ్రీనివాసులుకు అవార్డు ఇస్తున్న జిల్లా ప్రజారవాణాధి కారి మురళీబాబు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 510

కావలిలో 10 రోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి, మే 27(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని ఉత్తర శివార్లలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పు పనులు జరుగుతున్నాయని కావలి ఒకటో పట్టణ విద్యుత్ ఏఈ నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 27 నుంచి 10 రోజుల పాటు దాని పరిధిలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. మద్దూరుపాడు సబ్‌స్టేషన్ నుంచి ట్రంకురోడ్డులోని నమస్కార్ హోటల్ వరకు, పాతూరులోని కృష్ణుడి బొమ్మ సెంటర్ పరిసరాలు, నేమ్స్ స్కూల్ పరిసరాలు, గీతాంజలి అపార్ట్‌మెంట్ ప్రాంతం, నలందస్కూల్ పరిసర ప్రాంతం, మసీద్‌సెంటర్ దాని పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ఆ ప్రాంతవాసులు ఈ అంతరాయానికి సహకరించాలని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు తెట్టు గంధమహోత్సవం

గుడ్లూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టులో సయ్యద్‌సుల్తాన్ బీబీ దర్గా గంధమహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

2 నుంచి గిరిజనులకు ప్రత్యేక ఆధార్ శిబిరం

బిట్రగుంట, మే 27(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల పరిధిలో ఆధార్ కార్డు లేని గిరిజనుల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ 2 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు లేని గిరిజనులను గుర్తించి ఆయా పంచాయతీల కార్యదర్శులు వారికి ఆధార్ నమోదు చేయించాలని పేర్కొన్నారు.

117 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 525 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 408 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-85, ఆర్‌ఆర్-13, సీఆర్-18, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 117 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.242.02గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

సీపీఎం సమైక్యత యాత్ర

జలదంకి, మే 27(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జలదంకిలో సమైక్యత యాత్ర నిర్వహించారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం అంటూ అమెరికాకు లొంగిన కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వైఖరిని నిరసిస్తూ సీపీఎం కార్యాలయం నుంచి గట్టుపల్లి రోడ్డు, ఎస్సీకాలనీ కేంద్రంగా బస్టాండు కూడలి వరకు యాత్ర కొనసాగింది. ప్రధాని నరేంద్రమోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు లొంగడం సిగ్గుచేటని, దేశంలో ప్రజలందరూ కులమతాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉండి దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని నాయకులు కోరారు. పెహల్గాం ఘటన తరువాత మోదీ పాకిస్తాన్ మీద నాలుగు రోజులు దూందాం అని ఆఖరికి ఉగ్రవాదులను పట్టుకోకుండా మేము యుద్ధం చేశామని ప్రగల్భాలు పలికారని పేర్కొన్నారు. పెహల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన సందర్శకులకు జోహర్లు తెలిపారు. ఈ యాత్రలో నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, గడ్డం మాల్యాద్రి, రాధాకృష్ణ, మేలంగి ఆంథోనీబాబు, నరసింహ, బాలయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలను తొలగించండి

అల్లూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూర్పు గోగులపల్లి, పడమర గోగులపల్లి, పురిణి ఆయకట్టు పరిధిలోని 4500 ఎకరాలకు సాగునీటిని అందించే 800 ఎకరాల పురిణి చెరువులో ఆక్రమణలను తొలగించి సాగునీటిని పుష్కలంగా అందించాలంటూ ఆ ప్రాంత రైతులు కలెక్టరు ఆనంద్‌కు విన్నవించారు. మంగళవారం అల్లూరుకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 800 ఎకరాలు ఉండాల్సిన చెరువు విస్తీర్ణం కేవలం 50 నుంచి 100 ఎకరాలకు తగ్గిపోయిందని, ఈ కారణంగా సాగునీరు కేవలం పారుదలపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని తెలిపారు. దీనికి ఆయన స్పందిస్తూ ఒక్కసారిగా ఆక్రమణలను తొలగించే వీలు లేదని, ప్రతి భూమికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు, ఇరిగేషన్ ఏఈలను ఆదేశించారు.

ఐదుగురు విద్యార్థులకు ఆర్థిక సాయం

కావలి, మే 27(ఆంధ్రజ్యోతి) : మనరెడ్డి ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లాలో 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యనభ్యశించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేద రెడ్డి విద్యార్థులు 5 మందికి ఆర్థిక సహాయం అందచేయనున్నట్లు ఆ ఫౌండేషన్ సభ్యులు బత్తిన ప్రభాకరరెడ్డి, కూరపాటి వెంకటకృష్ణారెడ్డి, చిన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు పట్టణంలో వారికి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి 5 మందిని ఎంపిక చేసి రాబోయే విద్యా సంవత్సరానికి ఆర్థికసహాయం అందచేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9390844319ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు వాట్సప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాలు...

యమపాశాలు!

- శిథిలమై కూలుతున్న వైనం
- భయాందోళనలో పట్టణ వాసులు
- కాలనీల్లో కర్రలే విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ముసునూరు ఇందిరమ్మ కాలనీలో కర్రలకు కట్టిన విద్యుత్ తీగలు

కావలి రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ, పరిసర ప్రాంతాల్లో నివాసాల మధ్యన, ప్రధాన రోడ్లకు పక్కన కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు ప్రజల పట్ల యమపాశాలుగా మారాయి. శిథిలమైన స్తంభాలు కూలి ప్రజల ప్రాణాలు తీస్తున్నా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని వాయునందనప్రెస్ వీధిలో బద్దలుగా చీలి కూలేందుకు సిద్ధంగా ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభం పక్కన సుమారు 2 ఏళ్ల క్రితం మరో స్తంభం ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు దానికి విద్యుత్ వైర్లు మార్చకుండా వదిలేశారు. దీంతో దెబ్బతిన్న ఆ స్తంభం తీగల మోపున వేలాడుతూ ప్రమాదకరంగా ఉంది. దీంతో ఆ ప్రాంత వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ నెల 19వ తేదీ తెల్లవారు జామున వాయునందనప్రెస్ వీధిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం నడిరోడ్డుపై ఇరిగిపడి తీగల మోపున వేలాడింది. ఈ స్తంభం దెబ్బతిన్న విషయాన్ని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. అలాగే పాత శివాలయం రోడ్డులోని జడ్పీ హైస్కూల్ ఎదురుగా మురుగునీటి కాలువ అంచున ఉన్న 11కేవీ లైన్ ఇనుప విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి సపోర్టు తీగ మోపున ఉంది. నిత్యం ఆలయాలకు వచ్చే భక్తులతో పాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో రద్దీగా ఉండే ఆ మార్గంలో ఎప్పుడు స్తంభం విరిగి మీద పడుతుందోనని భయంతో ఆందోళన చెందుతున్నారు. ముసునూరులోని దివ్యాంగుల కాలనీలో ఈనెల 4వ తేదీన విద్యుత్ స్తంభం విరగటంతో ఆ స్తంభాన్ని ఇంటి గోడకు కట్టి పెట్టారు. అలాగే ఈనెల 20వ తేదీన పట్టణంలోని ఉదయగిరి రోడ్డులోని వైన్ షాపు ఎదురు విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన సపోర్టు స్తంభం కూలి తల మీద పడటంతో మద్దెల వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలా పట్టణంలోని కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు అనేకం దర్శనమిస్తున్నాయి. అలాగే ముసునూరు ఇందిరమ్మ కాలనీలో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్రలు నాటి వాటికి విద్యుత్ తీగలు కట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలం వచ్చినప్పుడు కర్రలు పడిపోతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాల బారిన పడాల్సివస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిని ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయన్న విషయాన్ని అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవటం లేదని, చిన్నపాటి గాలులు వీచినా భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పట్టణ వాసుల కోరుతున్నారు.



పాత శివాలయం రోడ్డులో పునాది కదిలిపోయి ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ లైన్ విద్యుత్ స్తంభం, వాయునందన ప్రెస్ వీధిలో రెండుగా చీలిన 11 కేవీ లైన్ విద్యుత్ స్తంభం

దెబ్బతిన్న స్తంభాలను మార్పిస్తాం

మా దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నాం. పట్టణంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి వెంటనే మార్పిస్తాం. అలాగే విద్యుత్ స్తంభాలు లేని విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయిస్తాం.

- బెనర్జీ, విద్యుత్ శాఖ ఈఈ, కావలి

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు



టీడీపీ మహానాడుకు తరలివెళ్తున్న కందుకూరు నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు కందుకూరు నియోజకవర్గం నుంచి తెలుగుతమ్ముళ్లు మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సారథ్యంలో వివిధ మండలాల కమిటీల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, పార్టీ జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలలో వివిధ బాధ్యతల్లో పనిచేస్తున్న ముఖ్యనాయకులు ప్రత్యేక వాహనాల్లో పసుపు పండుగకు బయలుదేరి వెళ్లారు. వీరితోపాటు పలు గ్రామాల ముఖ్యనేతలు, పార్టీలో క్రియాశీలంగా పనిచేస్తున్న పలువురు కార్యకర్తలు ఉత్సాహంగా పసుపు చొక్కాలు, కండువాలు ధరించి తరలివెళ్లారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నుంచి అందరూ ఒకేసారి ర్యాలీగా ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

● నేడు ఎన్టీఆర్ జయంతి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి కార్యక్రమాన్ని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో నిర్వహిస్తున్న అన్న ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహానాడులో అల్లూరు నాయకులు

అల్లూరు : కడపలో నిర్వహిస్తున్న తెలుగుదేశం మహానాడుకు మండలంలోని కీలక నాయకులు తరలివెళ్లారు. నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో వీరంతా మహానాడులో పాల్గొని పార్టీ సిద్ధాంతాలను తెలుసుకున్నారు. పాల్గొన్నవారిలో నెల్లూరు పార్లమెంటు కోశాధికారి పలగాటి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రేబాల శంకర్ రెడ్డితోపాటు మండల స్థాయి నాయకులు మేడా కృష్ణారెడ్డి, తోట శ్రీహరి, సామంతుల పరంధామరెడ్డి, అరగల రమణయ్య, ఊటు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు తరలి వెళ్లారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో వ్యవహరించాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ ప్రభావతి కోరారు. మండలంలోని పందలపాడులో కిశోరివికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సైబర్ నేరాలు - దైనందిన జీవితంలో యోగా ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్‌నేరాలు విరివిగా జరుగుతున్నాయని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని, ఎవరికీ ఓటీపీలు చెప్పకూడదని తెలిపారు. మీ ఆధార్, పాన్ నెంబర్లను ఎలాంటి యాప్‌లలో అప్‌లోడ్ చేయకుండా మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, సైబర్ నేరాల కారణంగా సామాన్య ప్రజలు కోట్లాది రూపాయలు నష్టపోతున్న పరిస్థితులు ఉన్నందున మహిళలు వీటిపట్ల సంపూర్ణ అవగాహనతో తమ బిడ్డలను కూడా ఈనేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవటం ద్వారా ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవనం గడపాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళాపోలీసు గుండ్ల గిరిజ, వరల్డ్‌విజన్ మేనేజరు యేసయ్య, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ స్వప్న, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కందుకూరు : కిశోరి వికాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్, తదితరులు

కిశోరి వికాసంతో సమాజాభివృద్ధి

వలేటివారిపాలెం : కిశోర బాలికల వికాసంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు కందుకూరు సీడీపీవో శర్మిష్ట తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్యవివాహాలు నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, ప్రసన్న, కార్యకర్తలు చంద్రకళ, శిరీషా, బాలికలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి



సమావేశంలో సమీక్షిస్తున్న అధికారులు

కావలిరూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. కావలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సాధారణ సమావేశం జరిగింది. తాగునీరు, పారిశుధ్యం, ఉపాధిహామీ పథకం తదితర అంశాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ ఆర్సీపాలెం, ఆనెమడుగు, సర్వాయపాలెం పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉపయోగంలో లేవని మిగిలిన చోట్ల చెత్త సేకరణ జరుగుతుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చెత్తతో సంపద కేంద్రాలు మరమ్మతులు చేయించాలని సర్పంచులను కోరారు. గ్రామాల్లో రోడ్డు సైడు పేడదిబ్బల తొలగింపునకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. గతంలో నిధులు ఖర్చు చేశారు గాని చేసిన అభివృద్ధి మాత్రం కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పామంజి రాజయ్య, అరగల కవిత, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు సన్నద్ధం



కావలి : యోగా చేస్తున్న మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు, సిబ్బంది

కావలి, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం కావలి పట్టణంలోని ఎంపీ ట్రంకురోడ్డులో ఉన్న ఐకాన్ సెంటర్ వద్ద మున్సిపల్ అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేసి సన్నద్ధ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు యోగా ట్రైనర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ యోగాలో దాని యొక్క ఉపయోగాలను గురించి వివరించారు. అనంతరం అందరికీ అవసరమైన యోగాసనాలను గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, ఆర్వో ఫణీంద్ర, టీపీవో వివేకానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

● **అల్లూరు** : అల్లూరు-1,2,3 సచివాలయాల్లో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నగర పంచాయతీ ఈడీవో వరప్రసాద్ స్థానికుల భాగస్వామ్యంతో యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పెనుగొండయ్య, సుజాత, సమత, మణికంఠ, ఉమా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం** : యోగాతో శారీరక మానసిక ప్రశాంతతో పాటు పలు రకాల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. యోగాపై గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ఎక్కడెక్కడ యోగా కార్యక్రమాలు నిర్వహించేది ఒకటి రెండు రోజులలో తెలియజేస్తామన్నారు.

● **వలేటివారిపాలెం** : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నరేంద్రదేవ్ ఆధ్వర్యంలో మంగళవారం యోగాపై శిక్షణ కార్యక్రమం జరిగింది. గ్రామ సచివాలయ ఉద్యోగులకు శిక్షణ పొందిన వలేటివారిపాలెం, పోకూరు హైస్కూల్స్ పీడీలు ఐజాక్, వెంకటేశ్వర్లు, చుండి మోడల్‌స్కూల్ యోగా టీచర్ శ్రీలత శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో నరేంద్రదేవ్ మాట్లాడుతూ బుధవారం వలేటివారిపాలెం హైస్కూల్‌లో 200 మంది సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

30న మండలస్థాయి యోగా తరగతులు

ఉలవపాడు : అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఈనెల 30వ తేదీన మండలంలో యోగా శిక్షణ తరగతులు ఉదయం 11 గంటలకు మొదలవుతాయని ఎంపీడీవో ఎస్ విజయ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో యోగా నిర్వహిస్తారని తెలిపారు. వెలుగు సిబ్బంది, సీసీలు, వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు మండల మహిళా సమాఖ్య సమావేశం మందిరంలో, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, ఏంఈవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగాసనాలలో ఉత్తమ ప్రతిభ చూపిన వాళ్లను జిల్లాస్థాయి యోగా శిక్షణ తరగతులకు ఎంపిక చేస్తామన్నారు.



అల్లూరు : ప్రజలకు యోగాసనాలు నేర్పుతున్న కార్యదర్శి వరప్రసాద్

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాలను సందర్శించిన ప్రతినిధులు వేలంలో దక్కుతున్న ధరలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పలువురు రైతులు మాట్లాడుతూ పొగాకు అమ్ముకోవడం తలకుమించిన భారంగా మారిందని, ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టి పొగాకు పండించగా ఈ ఏడాది ధరలు చూస్తుంటే పెట్టుబడులు కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతుసంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పేరుకే గరిష్ఠ ధరగా క్వింటం రూ.28వేలు చూయిస్తూ నాణ్యమైన పొగాకును కూడా రూ.20వేలకు కొనకుండా రైతులను వ్యాపారులు నిలువునా దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగి పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకుంటే రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు వర్థినేని సిద్ధయ్య, ఎస్ఏ గౌస్, జీ. వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల కోసం 2న సీపీఐ నిరసన



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): నివేశన స్థలాలు లేని పేదలందరికీ పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జూన్ 2న కందుకూరులో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పీ.మాలకొండయ్య కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిరసన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయటంలో విఫలమైందని, ఇళ్ల స్థలాలకు సంబంధించిన హామీ అమలుకు ఎలాంటి కార్యాచరణ లేదని విమర్శించారు. మరోపక్క గృహ నిర్మాణాలకు సంబంధించి మెటీరియల్ ధరలు విపరీతంగా పెరగటంతో ప్రభుత్వం ఇస్తున్న అరకొర సహకారం చాలక పేదలు నానాఅవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదల గృహనిర్మాణం కోసం కనీసం రూ. 5లక్షలు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ.సురేష్‌బాబు, కే.మురళీ, వై.ఆనంద్‌మోహన్, లక్ష్మీనారాయణ, ఉప్పుటూరి మాధవరావు, సీహెచ్ దుర్గాప్రసాద్, పీ. కోటేశ్వరరావు, యనమల కొండయ్య, బాలబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు సమయపాలన పాటించాలి



మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీవో మురళీధర్‌రావు

కొండాపురం, మే 27(ఆంధ్ర జ్యోతి): ఉపాధి కూలీలు 4 గంటల సమయం తోపాటు ఖచ్చితమైన కొలతల ప్రకారం పనులు చేయాలని ఉపాధిహామీ ఏపీవో మురళీధరరావు అన్నారు. మంగళవారం మండలంలోని భీమవరప్పాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. మస్టర్లలో నమోదైన కూలీలు అక్కడ ఉన్న కూలీల సంఖ్య సరిపోయిందన్నారు. వేసవి కాలం కావడంతో పనులు జరిగే ప్రదేశానికి ప్రతి ఒక్కరూ తాగునీరు తీసుకురావాలని కూలీలకు సూచించారు. గ్రామం నుంచి పని జరిగే ప్రదేశం 5 కిలో మీటర్లపైన ఉంటే రవాణాకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. ఖచ్చితమైన కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు ఒక్క కూలీకి రూ.307 నగదు వారి ఖాతాకు ప్రభుత్వం జమచేస్తుందన్నారు.



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.



రేపటి నుంచి 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్'

నెల్లూరు(వ్యవసాయం), మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం నుంచి వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివజ్యోతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 12వతేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేవీకే బృందం, ఇతర శాస్త్రవేత్తలు, అధికారులు సంయుక్తంగా జిల్లాలోని 38 మండలాలను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఇతర రంగాలపై రైతులతో చర్చిస్తారని, ఇఫ్కో వారి సహకారంతో డ్రోన్ స్ప్రేయింగ్ ప్రదర్శన చేపడతామని తెలిపారు. చీడపీడలు, ఇతర సమస్యలకు నివారణ మార్గాలు సూచిస్తారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో రైతులు పాల్గొనాలని కోరారు.

దేశ సమగ్రత కోసమే సమైక్యత యాత్ర

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

కావలి, మే 27(ఆంధ్రజ్యోతి) : దేశసమగ్రత కోసమే సీపీఎం సమైక్యత యాత్రలు ప్రారంభించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. మంగళవారం కావలి పట్టణంలో సమైక్యత యాత్ర ప్రదర్శన జరిగింది. ఏరియా వైద్యశాల నుంచి ప్రారంభమై కోర్టు సెంటర్, కూరగాయల మార్కెట్ మీదుగా తిరిగి ఉదయగిరి బ్రిడ్జిసెంటర్‌కు యాత్ర చేరుకుంది. ఈ ప్రదర్శనలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మూలం రమేష్ మాట్లాడుతూ కశ్మీర్ పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులలో 26 మంది చనిపోయారన్నారు. వారిలో కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన రావు కూడా ఉన్నారని వారి కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా నిలవాలన్నారు. కాల్పులు జరిపిన ఉగ్రవాదులలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఒక్క ఉగ్రవాదిని కూడా పట్టుకున్న దాఖలాలు లేవన్నారు. పాకిస్థాన్‌పై భారత్ యుద్ధం చేస్తుంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధం విరమించాలని కోరగానే భారత్ వెంటనే యుద్ధం విరమించిందన్నారు. భారతదేశంపై అమెరికా అధ్యక్షుడి పెత్తనం ఏమిటని, దీని వలన భారతదేశ సౌరభౌమాధికారం దెబ్బతింటుందన్నారు. కొంత మంది మతోన్మాదులు దేశప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఇలాంటి దుర్మార్గాలను దేశ ప్రజలు సమైక్యంగా ఉండి తిప్పి కొట్టాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ పార్టీ తీసుకువస్తున్న ప్రమాదకరమైన విధానాలను ప్రజలకు వివరించేందుకు సీపీఎం సమైక్యతా యాత్రలు జరుపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.పుల్లయ్య, పీ.పెచలయ్య, ఎస్.వెంకయ్య, పీ.తిరిపాలు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



కావలిలో సమైక్యత యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

లాడ్జి టాయిలెట్‌లో ఒకరి మృతి

● రెండు నెలల క్రితమే వివాహం
● అనారోగ్యమే కారణమంటున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), మే 27 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులోని లాడ్జిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కారనిమిట్ట గ్రామానికి చెందిన పెద్ద గురవయ్య, వెంకమ్మ దంపతులకు నలుగురు సంతానం. పెద్ద కుమారుడు సమ్మిటి విజయకుమార్ మదనపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. రెండు నెలల కిందట ఆయనకు ఉషాతో వివాహం అయ్యింది. ఈ నెల 26వ తేదీ ఉదయం విజయకుమార్ ఇంటి నుంచి మదనపల్లికి ఉద్యోగ నిమిత్తం వెళ్లారు. వైద్యశాలలోని డాక్టర్ మందులు తీసుకురావాలని చెప్పగా అదేరోజు నెల్లూరుకు వచ్చారు. ఆర్టీసీ బస్టాండు లోని రిజర్వేషన్ కౌంటర్ పక్కనే ఉన్న ఎంఎస్‌ఆర్ డీలక్స్ లాడ్జిలో టాయిలెట్‌కి వెళ్లారు. అక్కడే కుప్పకూలి పోవడంతో గమనించిన లాడ్జి సిబ్బంది చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. విజయకుమార్ తమ్ముడు చందుకు ఫోన్ చేసి విషయం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మంగళవారం ఉదయం విజయకుమార్ కుటుంబ సభ్యులు నెల్లూరుకు చేరుకొని కన్నీరు మున్నీ రయ్యారు. చందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీసీ ఫుటేజ్‌లు పరిశీలించిన పోలీసులు అనారోగ్యంతోనే విజయకుమార్ మృతి చెందాడని భావిస్తున్నారు.

రైతులకు వరం ఎఫ్‌పీవో

దీనిపై అవగాహన తెచ్చుకోవాలి : కలెక్టర్

అల్లూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవే శపెట్టిన ఎఫ్‌పీవోపై (ఫార్మర్ ప్రొక్యూర్ ఆర్గనైజేషన్) అవగా హన కలిగి అందులో సభ్యులుగా మారితే తద్వారా వచ్చే ఫలాలను అందుకోవచ్చని కలెక్టర్ ఆనంద్ రైతులతో అన్నారు. 2025-26 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ చము రు విత్తనాల దిగుబడిని పెంచే కార్యక్ర మంలో భాగంగా అల్లూరు మండ లం తూర్పు గోగులపల్లి చంద్రశేఖర పురంలో నిర్వహించిన వేరుశనగ విత్తనాల పంపిణీకి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ 200 మంది రైతులు కలిసి ఎఫ్‌పీవోను ఏర్పాటు చేసుకుంటే సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితరాలు తక్కువ ధరకే పొందడంతోపాటు దిగుబడు లను మార్కెట్లో అత్యధిక ధరకు విక్రయించు కునే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ముందుగా అవగా హన వచ్చేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని వ్యవసాయాధికారులు, ఎఫ్‌పీవో ప్రతినిధులను ఆదేశించారు. వేరుశెనగ పంటను అభివృద్ధి చేసేందుకు ఎంపికైన రైతు లకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఆత్మ పీడీ శివనారాయణ, జిల్లా కోఆపరేటివ్ మేనేజరు గుర్రప్ప, ఎఫ్‌పీవో ప్రతినిధి గోపిరెడ్డి, ఏడీఏలు నాగరాజు, నర్సోజి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రజనీకాంత్, ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

సోమశిలలో 43.653 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామ ర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళ వారం నాటికి 43.653 టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 162 క్యూసెక్కులు ప్రవాహం వస్తుండగా పెన్నా డెల్టాకు 3,000, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నా మని వారు పేర్కొన్నారు.

పంచాయతీలకు రూ. 70 కోట్ల ఆర్థిక సంఘం నిధులు : డీపీవో

సంగం, మే 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జిల్లాలోని పంచాయతీలకు ఆర్థిక సంఘం నుంచి సుమారు రూ. 70 కోట్ల మేరకు నిధులు మంజూరయ్యాయని డీపీవో శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సంగంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. వర్మికంపోస్టు తయారీ పనితీరును పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శులకు ఇంటింటా చెత్త సేకరణ, తడి,పొడి చెత్త వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించి, వర్మి కంపోస్టు తయారు చేసి విక్రయించి సంపద సృష్టించడం, పారిశుధ్యం, తాగునీటి పంపిణీ, వీధిలైట్ల నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల వివరాలను స్వర్ణ పంచాయతీ పోర్టల్ యాప్‌లో నమోదుపై వివరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 200 పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణ జరుగుతుందన్నారు. చెత్త సేకరణపై ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో 60 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. దీన్ని 80 శాతం పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో అక్రమాలకు పాల్పడిన 20 మంది పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశామని, అక్రమాలు అరికట్టేందుకు పంచాయతీలో జరిగే కార్యక్రమాలతోపాటు నగదు లావాదేవీలన్నీ స్వర్ణ పంచాయతీ పోర్టల్ యాప్‌లో నమోదుకు ఆదేశించామన్నారు. పంచాయతీల్లో జరిగే పారిశుధ్య కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో షాలెట్, డీఎల్‌పీవో, ఈవోఆర్డీ, పీఆర్ ఏఈ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

వైద్యుల సిఫార్సు లేకుండా స్కానింగ్ చేయొద్దు

● జిల్లా స్థాయి సలహా మండలిలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), మే 27 (ఆంధ్రజ్యోతి) : స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు వైద్యుల సిఫార్సు లేకుండా ఎలాంటి పరిస్థితిలోనూ స్కానింగ్ పరీక్షలు చేయరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. డీఎంహెచ్‌వో చాంబర్‌లో మంగళవారం గర్భస్థ పిండ నిర్ధారణ నిషేధ చట్టం అమలుకు జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భస్థ పిండ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఆర్‌ఎంపీలు సిఫార్సు చేస్తే స్కానింగ్ తీయకూడదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై నెలకు 10 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించా లని తీర్మానించారు. జిల్లా స్థాయి సలహా సంఘం అధ్యక్షులు డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో భ్రూణహత్యలు అరికట్టే దిశగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆడిపిల్ల పుట్టుక ఆవశ్య కతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిం చాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పరిమళ, వైద్యాధికారులు డాక్టర్ సర్దాన్ సుల్తానా, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ దయాకర్, సదారావు, డెమో కనకరత్నం, ఎన్‌జీవో ప్రతినిధులు కవితారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

ఉద్యోగులపై ఆరోపణలు వస్తే కఠిన చర్యలు

విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), మే 27(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతి, అక్రమాలకు పాల్పడినా, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, ఆరోపణలు వస్తే విచారించి కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులను, ఉద్యోగులను హెచ్చరించారు. ఆయన చాంబర్ నుంచి మంగళవారం జిల్లాలోని విద్యుత్ శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతీ అధికారి, ఉద్యోగి వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు వెంటనే మంజూరు చేయాలని సూచించారు. లోవోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరా తదితర సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. వచ్చే నెల 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవానికి ఉద్యోగులంతా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.